అనునిత్యం జనపక్షం

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

నిజామాబాద్-కామారెడ్డి

1

బుధవారం 14 జూన్ 2023

బీసీ కులవృత్తుల వారు దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ-తాడ్వాయి

రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న లక్ష రూపాయల సాయం కోసం బీసీ వర్గానికి చెందిన కులవృత్తుల వారు మీ సేవలో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో రాజీవ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాడ్వాయి మండలంలోని బీసీ కులాలతో పాటు, కుల వృత్తులకు చెందిన నాయి బ్రాహ్మణ, చాకలి, ఉప్పరి, కుమ్మరి, ఆవుసుల, కమ్మరి, కంచరి,వడ్రంగి,, బలిజ పూసల మ్యాదరి, వడ్డెర కులాల చెందినవారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆధార్ కార్డు, పాస్పోర్ట్ సైజ్ ఫోటో, కుల ధ్రువీకరణ పత్రము ఆదాయయ సర్టిఫికెట్ తదితర ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. జూన్ 20వ తేదీ చివరి గడువు అని అంతకుముందే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. బీసీ కులాల వారు, వృత్తుల వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

9 ఏండ్లల్లో ఎంతో అభివృద్ధి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ప్రధానమంత్రి మోడీ ఆధ్వర్యంలో ఎన్డీఏ ప్రభుత్వం 9 సంవత్సరాలలో దేశంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశారని కేంద్ర మాజీ మంత్రి, ఎంపీ ప్రకాశ్ జవదేకర్ అన్నారు. నగరంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో ప్రెస్‌మీట్ నిర్వహించి మాట్లాడారు. 2014, 2019లో పూర్తి మెజార్టీ తో వచ్చిందని, మోడీపై ప్రజలకు విశ్వాసం ఉందని ప్రజలు నమ్ముతున్నారని, బిజెపి పార్టీకి ఓటు వేశారని, ఎన్నో అచీవ్మెంట్ లు సాధించారని, తెలంగాణ రాష్ట్రం నీళ్లు, నిధులు, నియామకాల గురించి ఏర్పాటు చేశారని అయినా ఇక్కడ అమలు చేయడంలో ముఖ్యమంత్రి విఫలమయ్యారు అని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు పర్మిషన్ కోసం పర్మిషన్ కు నిర్లక్ష్యం చేయలేదు అని, రామగుండంలో 6,000 కోట్లు ఖర్చుపెట్టి ఫర్టిలైజర్ ఫ్యాక్టరీ తీసుకువచ్చినట్లు తెలిపారు.

గల్లీకో బెల్ట్‌షాప్

- గ్రామాల్లో విచ్చలవిడిగా వెలుస్తున్న దుకాణాలు
- మద్యానికి బానిసవుతున్న యువత
- రోజురోజుకూ పెరుగుతున్న నిర్వాహకుల ఆగడాలు
- ఒక చోట మద్యం డబ్బుల కోసం యువకుడిని కట్టేసిన వైనం





బిచ్కుందలో మద్యం డబ్బుల కోసం యువకుడిని తాళ్లతో కట్టేసని బెల్ట్‌షాప్ నిర్వహకుడు

నవతెలంగాణ-బిచ్కుంద

గ్రామాల్లో బెల్ట్‌షాప్‌ల దందా జోరుగా కొనసాగుతోంది. గల్లీకో మద్యం షాప్ ఏర్పాటు కావడంతో మద్యం ఏరులై పారుతోంది. రాత్రి పగలు అనే తేడా లేకుండా 24/7 అందుబాటులో ఉంటుంది. కిరాణా దుకాణం నుంచి మొదలుకొని నివాస గృహాలు, కల్లు కాంపౌండ్ పరిసరాలు, ముఖ్యంగా హెూటల్లతో పాటు బెల్ట్ షాపుల షెడ్లు ఏర్పాటు చేసి మద్యం విక్రయాలు జోరుగా సాగుతోంది. దీంతో పల్లెల్లో ప్రజలను మద్యం మత్తులో ముంచు తున్నారు.

వైన్స్‌లు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు తెరిచి ఉంటుండగా.. బెల్ట్‌షాపుల్లో మాత్రం 24 గంటల పాటు మద్యం విక్రయాలు జోరుగా కొనసాగుతున్నాయి. మద్యం మరింత అందు బాటులోకి తీసుకొని రావడంతో దానికి బానిసలై తమ ఆరోగ్యా లను పాడుచేసు కుంటు న్నారు. దీంతో పాటు కుటుంబాల్లో నిత్యం గొడవలు జరుగుతున్నాయి. దీంతో ఆత్మహత్యలే శరణం అంటూ కుటుంబ సభ్యులను దిక్కుతోచని స్థితిలో నిలబెడు తున్నారు. ఒకప్పుడు పట్టణ ప్రాంతాల కు పరిమితమైన ఈ దందా ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో విచ్చలవిడిగా కొనసాగు తుండటంతో ముఖ్యం గా యువకులు మద్యానికి బానిసై తమ జీవితాలను పాడు చేసుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో బెల్టు దుకాణాలపై ఉక్కు పాదం మోపుతు న్నామని అధికారులు ప్రకటిస్తున్నప్పటికీ బెల్ట్ షాప్ ల నుండి నెలవారి ముడుపులు అందడంతో ఎక్సైజ్ అధికారులు కానీ పోలీస్ అధికారులు బెల్ట్ షాపుల వైపు కన్నెత్తి చూడడం లేదంటూ ప్రజలు బహిరం గంగానే చర్చించుకుం టున్నారు.

డబ్బులు కట్టలేదని కట్టేసిన వైనం

బిచ్కుంద మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ఒక బెల్ట్ షాపులో మండలంలోని మిషన్ కల్లాలి గ్రామానికి చెందిన ఒక వ్యక్తి గత కొన్ని రోజులుగా మద్యం సేవించిన డబ్బులు ఇవ్వలేదంటూ బెల్ట్ షాప్ ఆవరణలో సోమవారం రాత్రి 8 గంటల సమయంలో తాళ్లతో కట్టివేశారు. గత కొన్ని రోజులుగా రోజు సేవించిన మద్యం డబ్బులు 2530 రూపాయలు ఇచ్చేవరకు విడిచిపెట్టేది లేదని బెల్ట్ షాప్ నిర్వాహకుడు యువకుడిని కట్టి వేయడం మండల కేంద్రంలో చర్చనీయాంశంగా మారింది. బెల్ట్ షాపు నిర్వాహకులు ప్రజలకు అరువుగా ఎక్కువ ధరకు మద్యాన్ని విక్రయించి మద్యానికి బానిసలను చేసి డబ్బులు వసూళ్ల సమయంలో చిత్రహింసలు గురిచేసి హింసిస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత తతంగం జరిగిన బెల్ట్ షాప్ వైపు ఎక్సైజ్ అధికారులు గానీ పోలీసు అధికారులు కానీ చూడకపోవడం గమనార్హం.

ఎక్కువ ధరకు అరువుగా మద్యం విక్రయాలు

పుట్టగొడుగుల్లా బెల్ట్ షాపులు ఏర్పడడంతో బెల్ట్ షాప్ నిర్వాహ కులు కూలీలకు రైతులకు యువకులకు అరువుగా ఎక్కువ ధరకు మద్యం విక్రయాలు చేస్తూ అరువు ఖాతాలు నిర్వహిస్తు కూలీలు, రైతుల వద్ద నుండి వారానికి ఒక్కసారి పెన్షన్ దారుల నుండి నెలకు ఒకసారి డబ్బులు వసూలు చేస్తూ మద్యానికి ప్రజలకు మద్యనికి బానిసలు చేస్తున్నారు.

పుట్టగొడుగుల్లా వెలుస్తున్న గల్లీకో బెల్ట షాప్

ప్రభుత్వ నిబంధనలు ప్రకారం బెల్ట్ షాపులు గ్రామాలలో నిర్వహించడం నేరం. ఒక్క గ్రామంలో ఐదు నుండి పది వరకు మద్యం విక్రయిస్తున్న బెల్ట్ షాపులు కొనసాగుతున్నాయి. బెల్ట్ షాపుల్లో బాటిల్ పై ఎమ్మార్పీ కంటే 20 నుండి 50 రూపాయల వరకు ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారు. బీర్ బాటిల్‌పై 50 రూపాయల వరకు ఎక్కువ ధర తీసుకుం టూ యదేచ్ఛగా విక్రయా లు కొనసాగిస్తున్నారు

తరుచూ బెల్ట్ షాపుల్లో గొడవలు

బెల్ట్ షాపుల్లో సిట్టింగులు చేసి మద్యం సేవిస్తున్న వారు మద్యం మత్తులో మాట మాట పెరిగి గొడవలకు దారితీస్తున్నాయి. గతంలో బెల్ట్ షాపుల్లో గొడవ పడి కొట్టుకొని గాయాల పాలైన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. మద్యం సేవించిన వ్యక్తులు గొడవలు పడి గాయాల పాలైన పోలీస్ స్టేషన్ వరకు వెళ్లకుండా వారిని సముదాయించి బయటకు తెలియకుండా బెల్ట్ షాప్ నిర్వాహకులు చేస్తున్నారు. బెల్ట్ షాప్‌ల విషయంలో అధికారుల ఉదాసీన వైఖరిపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

ఊపిరి తీసిన మద్యం అప్పు

- బెల్ట్‌షాప్ నిర్వహకుడి వేధింపులతో యువకుడి ఆత్మహత్య
- ఏకమైన గ్రామస్తులు.. మద్యం బాటిల్లు ధ్వంసం



నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ మండ లంలోని రామేశ్వర్‌పల్లి గ్రామానికి చెందిన నాగర్తి నరేష్ రెడ్డి (37) అప్పుల బాధ భరించలేక మంగళ వారం తెల్లవారుజామున తన వ్యవసాయ బావి వద్ద చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న కుటుంబీకులు, గ్రామస్తులు మృతదేహాన్ని మృతికి కారణమైన గ్రామంలో ఉన్న బెల్టు షాపు ముందు ఉంచి ఆందోళనకు దిగారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో చేరుకొని గ్రామంలో ఉన్న బెల్టు షాపుల నుండి మద్యాన్ని తీసుకువచ్చి గాంధీ విగ్రహం ముందు ధ్వంసం చేశారు.

వివరాలు మెయిన్‌లో..

టీయూలో మరో దఫ సోదాలు

- అవినీతి అక్రమాలు వెలుగు లోకి వచ్చేనా?



నవతెలంగాణ-డిచ్‌పల్లి

రాష్ట్ర వ్యాప్తంగా గత రెండు నెలలుగా వివాదాలతో చర్చనీయమంశమైన తెలంగాణ యూనివర్సిటీపై ఎట్టకేలకు ప్రభుత్వం దృష్టి సారించింది. యూనివర్సిటీలో వైస్ ఛాన్సలర్ అవినీతి, అక్రమాలు,ఇతర అంశాలపై పలు విమర్శలు, ఆరోపణలు రావడంతో ప్రభుత్వం స్పందించింది. ఇటీవల ఎన్‌ఫోర్స్‌మెంట్, విజిలెన్స్ అధికారులు సోదాలు చేపట్టగా.. తాజాగా మంగళవారం రెండో సారి విజిలెన్స్ అధికారులు యూనివర్సిటీ లోని పలు విభాగాల్లో సోదాలు చేపట్టారు. వీసీ తీసుకున్న నిర్ణయాలు ఆర్థిక లావదేవీలు, తదితర అంశాలను విజిలేన్స్ అధికారులు రికార్డు చేసుకున్నారు. ఏవో కార్యాలయం, ఎస్టాబ్లిష్మెంట్ కార్యాలయం, అకౌంట్ సెక్షన్, ఇంజనీరింగ్ విభాగాలను, విజిలెన్స్ అధికారులు వేర్వేరుగా తనిఖీలు నిర్వహించారు. కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులందరి ఫోన్లను స్విచ్చాఫ్ చేయించి తనిఖీ లను చేపడుతున్నారు. అత్యంత జాగ్రత్తగా తలుపులు మూసివేసి ఎలాంటి సమాచారం బయట తెలియకుండా ముందస్తు చర్యలు చేపడుతూ అధికారులు తనిఖీలు చేశారు. అక్కడే కార్యాలయానికి వెళ్లిన అధికారులు మాజీ రిజిస్ట్రార్ గా పనిచేసిన విద్యావర్ధిని, ప్రిన్సిపాల్ ఆరతి లకు విచారణ కు రావలని ఆదేశించగా ఆ సమయంలో వారు యూనివర్సిటీ లో అందుబాటులో లేకపోవడం తో రాలేకపోయారు. సుదీర్ఘంగా జమా ఖర్చుల విభాగంలో సంబంధిత శాఖ అధికారి భాస్కర్ తో క్షుణ్ణంగా వివరాలను అడిగి తెలుసుకుని పరిశీలించారు. వీసీ తీసుకున్న నిర్ణయాలు, ఆర్థిక లావాదేవీలు, అక్రమ వస్తువుల కొనుగోళ్లకు సంబంధించిన ఫైల్స్ ను వారు పరిశీలించారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు 376 విద్యార్థులు గైర్హాజరు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు మంగళవారం ఉదయం మొదటి సంవత్సరం ఇంగ్లీష్ పరీక్షలు, మధ్యాహ్నం ఇంగ్లీష్ రెండువ సంవత్సరం పరీక్షలు నిర్వహించారు. ఉదయం మొత్తం 4,446 మంది విద్యార్థులకు గాను 303 మంది విద్యార్థులు గైర్హాజరు కాగా 4,143 మంది విద్యార్థులు హాజరయ్యారు. మధ్యాహ్నం రెండవ సంవత్సరం విద్యార్థులు మొత్తం 810 మంది విద్యార్థులకు గాను 737 మంది విద్యార్థులు హాజరు కాగా 73 మంది విద్యార్థులు గైర్హాజర య్యారు. జిల్లా ఇంటర్ విద్యా అధికారి రఘురాజ్ ఉద యం నిజామాబాద్ ప్రభు త్వ బాలుర జూనియర్ కళాశాలలో ఏ,బి పరీక్ష కేంద్రా లను, నిజా మాబాద్ లోని ప్రైవేట్ జూని యర్ కళాశాల లను తనిఖీ చేసి సమీక్షించారు.

అంగన్‌వాడీలకు, ఆశాలకు టీఏ, డీఏ చెల్లించాలి

సీఐటీయూ డిమాండ్

నవతెలంగాణ-మద్నూర్

దశాబ్ది ఉత్సవాలల్లో పాల్గొంటున్న అంగన్‌వాడీలకు, ఆశా కార్యకర్తలకు టీఏ, డీఏ చెల్లించాలని సీఐటీయూ జిల్లా నాయకులు సురేశ్ గొండ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం నిర్వహించిన మహిళా దినోత్సవంలో పాల్గొన్న వారికి టీఏ, డీఏ చెల్లించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వము దశబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నప్పటికీ అంగన్వాడీ టీచర్స్, ఆశ కార్యకర్తల సమస్యలు పరిష్కరించడంలో వివక్ష చూపుతోందని ఆయన అన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వీరిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని, పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యంతో పాటు పెండింగ్ బిల్లులు వెంటనే రిలీజ్ చేయాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు.

చౌట్‌పల్లి జీపీ కార్యదర్శికి ఉత్తమ సేవా ప్రశంస పత్రం



ప్రశంసా పత్రం అందజేస్తున్న మంత్రి వేముల

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని చౌట్‌పల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎనుగందుల గంగాజమునకు ఉత్తమ సేవా ప్రశంస పత్రం లభించింది. దశాబ్ది ఉత్సవాలల్లో భాగంగా మంగళవారం వేల్పూర్ మండలం లక్కోరాలో నిర్వహించిన బాల్కొండ నియోజకవర్గ స్థాయి మహిళా సంక్షేమ దినోత్సవ కార్యక్రమంలో కమ్మర్‌పల్లి మండలానికి గాను గంగా జమునకు ఉత్తమ సేవా ప్రశంస పత్రం మంత్రి వేముల, కలెక్టర్ రాజీవ్‌గాంధీ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా గంగా జమున మాట్లాడుతూ తన సేవలను గుర్తించి ప్రభుత్వం ఉత్తమ సేవా పత్రం అందించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఇందుకు సహకరించిన స్థానిక సర్పంచ్ మారు శంకర్, జిల్లా, మండల స్థాయి అధికారులకు, స్థానిక ప్రజాప్రతినిధులకు, గ్రామస్తులకు కతజ్ఞతలు తెలిపారు.

మహిళల అభ్యున్నతికి పెద్దపీట

- ఓట్ల కోసం.. సీట్ల కోసం కాకుండా మహిళల సంక్షేమం కోసం నిర్విరామ కృషి
- మహిళా సంక్షేమ దినోత్సవంలో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి
- ప్రభుత్వ సహకారంతో మహిళల ఆర్థిక ప్రగతి : కలెక్టర్ రాజీవ్‌గాంధీ



మహిళా సంఘాలకు చెక్కు అందజేస్తున్న మంత్రి వేముల, కలెక్టర్, అధికారులు



వేడుకలకు హాజరైన అంగన్‌వాడీలు, ఆశాలు తదితర మహిళలు

నవతెలంగాణ-వేల్పూర్

బీఆర్ఎస్ రాష్ట్ర ప్రభుత్వం మహిళల శ్రేయస్సును కాంక్షిస్తూ అమలు చేస్తున్న పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి సూచించారు. అనుక్షణం మహిళల బాగోగుల గురించి ఆలోచన చేసే వ్యక్తి ముఖ్యమంత్రి కేసీఆర్ అని కొనియాడారు. మహిళల కోసమే ప్రత్యేకంగా బీడీ కార్మికులు, ఒంటరి మహిళలు, వింతంతువులకు పెన్షన్లు అందిస్తున్నారని, వృద్ధాప్య పెన్షన్ల పంపిణీలోనూ మహిళలకే మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామని అన్నారు. మానవీయ కోణంతో కల్యాణ లక్ష్మీ, షాదీముబారక్, కేసీఆర్ కిట్ పథకాలను అమలు చేస్తున్నారని గుర్తు చేశారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబం అభివృద్ధి చెందాలనే తలంపుతో మహిళలను కేంద్రంగా చేస్తూ, సంక్షేమ కార్యక్రమాలను వారికి వర్తింపజేస్తున్నారని తెలిపారు.

రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం మహిళా సంక్షేమ దినోత్సవ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. బాల్కొండ నియోజకవర్గానికి సంబంధించి వేల్పూర్ మండలం లక్కోరాలోని ఏ.ఎస్.జి ఫంక్షన్ హాల్‌లో జరిగిన మహిళా సంక్షేమ దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. అధిక సంఖ్యలో తరలివచ్చిన మహిళలు బోనాలు, మంగళహారతులతో మంత్రి, కలెక్టర్ కు ఘన స్వాగతం పలికారు. మహిళల అభ్యున్నతి, సంక్షేమం కోసం ప్రభుత్వం వివిధ శాఖల ఆధ్వర్యంలో అమలు చేస్తున్న కార్యక్రమాల గురించి, వాటి ద్వారా చేకూరుతున్న ప్రయోజనాల గురించి లబ్దిదారులు, స్థానిక సంస్థల మహిళా ప్రజాప్రతినిధులు వివరిస్తూ తెలంగాణ ప్రభుత్వానికి సభాముఖంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

ఈ సందర్భంగా మంత్రి వేముల మాట్లాడుతూ ఓట్ల కోసమో, రాజకీయ ప్రయోజనాల కోసం కాకుండా పేద కుటుంబాల గర్భిణీలకు కూడా ఆర్థిక స్థోమత కలిగిన వారి తరహాలోనే పోషక విలువలతో కూడిన బలవర్ధక ఆహారం అందాలని, తల్లీ, పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉండాలనే సదుద్దేశ్యంతో కేసీఆర్ కిట్ పథకం అమలు చేస్తున్నారని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరును మెరుగుపర్చి, ఇతోధికంగా తోడ్పాటును అందిస్తుండడంతో ప్రభుత్వాస్పత్రుల్లో 2014నాటికి 18శాతానికి పరిమితమైన కాన్పులు, నేడు 61శాతానికి పెరిగాయని, సిజేరియన్లు గణనీయంగా తగ్గాయని మంత్రి వివరించారు. మాతా శిశు మరణాల రేటు తగ్గుదలలోనూ తెలంగాణ యావత్ దేశానికి ఆదర్శంగా మారిందని అన్నారు. గర్భిణీల్లో రక్త హీనతను నివారించేందుకు తాజాగా న్యూట్రీషన్ కిట్ అందిస్తుందని తెలిపారు. దేశంలోని మరే ఇతర రాష్ట్రాల్లో ఇలాంటి కార్యక్రమాలు అమలు జరగడం లేదన్నారు.

స్వయం సహాయక సంఘాలకు విరివిగా వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామని మంత్రి తెలిపారు. తెలంగాణ ఏర్పాటుకు ముందు బాల్కొండ నియోజకవర్గంలో మహిళా సంఘాల సభ్యులు 28000 ఉండగా, ప్రస్తుతం వారి సంఖ్య 60,000లకు పెరిగిందని వివరించారు. వీరికి బ్యాంకు లింకేజీ కింద 2014కు ముందువరకు కేవలం రూ. 366 కోట్ల రుణాలు ఇవ్వగా, స్వరాష్ట్రంలో తొమ్మిదేళ్ల కాలంలోనే నాలుగు రెట్లు ఎక్కువగా రూ.1213 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు అందించామని తెలిపారు. స్త్రీనిధి పథకం కింద అప్పట్లో రూ. 28 కోట్లు మాత్రమే ఇవ్వగా, తమ ప్రభుత్వం పది రెట్లు అదనంగా రూ. 259 కోట్లు అందించిందని అన్నారు. గతంలో ఏడు కోట్లతో 2780 మంది మహిళా సంఘాల సభ్యులు వ్యాపారాలు నిర్వహించగా, తెలంగాణ ఏర్పాటు అయిన అనంతరం తమ ప్రభుత్వం సమకూర్చిన రూ. 259 కోట్ల పెట్టుబడితో 21,000 మంది స్వయం సహాయక సంఘాల సభ్యులు వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తూ ఆర్థిక సామాజిక అభివృద్ధిని సాధిస్తున్నారని మంత్రి హర్షం వెలిబుచ్చారు. 43 లక్షల రూపాయల ప్రభుత్వ పెట్టుబడితో వేల్పూర్ మండలంలో నియోజకవర్గ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో పసుపు ఉత్పత్తుల ఆధారిత ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయిస్తానని ఈ సందర్భంగా మంత్రి ప్రకటించారు దీని నిర్వహణతో వచ్చే లాభాలను మహిళా సమాఖ్య అందజేస్తామని అన్నారు. వేల్పూర్‌లో విజయవంతంగా కొనసాగితే నియోజకవర్గంలోని ఇతర ప్రాంతాల్లోనూ ఏర్పాటు చేయిస్తానని మంత్రి తెలిపారు. కాగా, మహిళా సంఘ సభ్యుల కోసం ఒక్క బాల్కొండ నియోజకవర్గంలోనే రెండు కోట్ల 81 లక్షలు వెచ్చిస్తూ 51 మహిళా సంఘ భవనాలను నిర్మించామన్నారు.

కరోనా సంక్షోభంలో ఆశా, అంగన్వాడిల సేవలు మరువలేనివి

కరోనా సంక్షోభ సమయంలో ఆశ కార్యకర్తలు, అంగన్వాడీ టీచర్లు, ఏ.ఎన్.ఎంలు ప్రజలకు అందించిన సేవలు మరువలేనివని మంత్రి ప్రశాంత్ రెడ్డి ప్రజల పక్షాన వారికి కృతజ్ఞతలు ప్రకటించారు. తమ ప్రాణాలను పణంగా పెట్టి ఎంతో ధైర్యంగా క్షేత్రస్థాయిలో ప్రజలకు సేవనందించి సమాజాన్ని బతికించుకున్నారని కొనియాడారు. ఇతర ఏ రాష్ట్రంలో లేని విధంగా ఆశాలు, అంగన్వాడీలు, ఏఎన్ఎంలు, వివోఏలకు తెలంగాణ ప్రభుత్వం వేతనాలు అందిస్తోందన్నారు. 2014లో ఆశ వర్కర్లకు వారి పనితీరును బట్టి నెలకు 2000 రూపాయల వేతనం ఇచ్చేవారని, ప్రస్తుతం దానిని తమ ప్రభుత్వం 9750 రూపాయలకు పెంచిందన్నారు. ఆశలకు రాజస్థాన్లో 3000 , గుజరాత్‌లో 6700 , కర్ణాటకలో 4000 , హర్యానాలో 4000 మాత్రమే చెల్లిస్తున్నారని చెప్పారు. అదేవిధంగా ఏఎన్ఎంలకు 2014 లో రూ. 10200లకే పరిమితమైన వేతనాన్ని 27,599 పెంచిన ఘనత తెలంగాణ ప్రభుత్వానికి దక్కిందన్నారు. ఏఎన్ఎంలకు మహారాష్ట్రలో 17,000, తమిళనాడులో 15000 , యూపీ, గుజరాత్లో 22,000 చొప్పున చెల్లిస్తున్నారని తెలిపారు. అంగన్వాడి టీచర్లకు తెలంగాణలో 13650 రూపాయల వేతనం ఇస్తుండగా, యూపీలో 7000 , రాజస్థాన్లో 7500 , మహారాష్ట్రలో 8325 రూపాయలు చెల్లిస్తున్నారని తెలిపారు. వి ఓ ఎల కు కూడా ఇతర రాష్ట్రాల కంటే తెలంగాణాలో మూడు రెట్లు ఎక్కువగా వేతనాలు అందిస్తున్నామని అన్నారు. వృద్ధులు, వికలాంగులు, వితంతువు లకు అందిస్తున్న ఆసరా పెన్షన్లు కూడా తెలంగాణలో మూడు రెట్లు ఎక్కువగా ఉన్నాయని వివరించారు. ప్రజలు వాస్తవాలను గమనించాలని, సరైన నిర్ణయం తీసుకొని మరింత సంక్షేమ అభివృద్ధికి బాటలు వేసుకోవాలని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి హితవు పలికారు.

కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ, జనాభాలో సగభాగం ఉన్న మహిళలు, సమాజ, దేశాభివృద్ధిలోనూ క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. మహిళా భద్రతా, వారి అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని, ఆర్థిక ప్రగతి దిశగా మహిళలను ముందడుగు వేస్తున్నారని అన్నారు. జిల్లాలో సుమారు 30 వేల మహిళా స్వయం సహాయక సంఘాలలో మూడు లక్షల మంది సభ్యులు కొనసాగుతున్నారని తెలిపారు. వీరంతా 12 వేల కోట్ల రూపాయల బ్యాంకు లింకేజీ రుణాలు తీసుకుని ఆర్థిక లావాదేవీలతో ప్రగతి దిశగా ముందుకు సాగుతున్నారని అన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలందించిన మహిళా ఉద్యోగులను ఈ సందర్భంగా సత్కరించారు. మహిళలకు మంత్రి చీరలను పంపిణీ చేశారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను మంత్రి సందర్శించారు. మండల సమాఖ్య వారు మంత్రికి తాము తయారు చేసిన పిండి వంటలు బహూకరించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

లిఫ్ట్ బంద్ చేయొద్దు

ఇరిగేషన్ అధికారులకు ఆయకట్టు రైతుల వినతి

నవతెలంగాణ-ఏర్గట్ల



వినతిపత్రం అందజేస్తున్న రైతులు, నాయకులు

గుమ్మిర్యాల్ గ్రామానికి చెందిన లిఫ్ట్ ఆయకట్టు రైతులు మంగళవారం ఇరిగేషన్ అధికారికి వినతిపత్రం అందించారు. 1995 యాక్ట్ ప్రకారం నూతన లిఫ్ట్ కమిటీ ఎన్నిక జరుపుకుని, కమిటీని నియమించుకున్నామని, ఈ విషయాన్ని చాలాసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్ళామని, రైతులు విత్తనాలు వేసే సమయంలో లిఫ్ట్ బంద్ చేయడం ఏంటని అన్నారు. నూతనంగా ఎన్నికైన లిఫ్ట్ కమిటీకి తాళాలు అందించి ఆయకట్టు రైతులకు సహరించవలసిందిగా అధికారులను కోరుతున్నామని, లేకుంటే రైతుల పంటలకు నీరు అందకుండా పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో భాగంగా సోమా నరేష్, రైతులు పాల్గొన్నారు.

శ్రీ చైతన్య పాఠశాల గుర్తింపును రద్దు చేయాలి : టీజీవీపీ

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని శ్రీ చైతన్య గుర్తింపును రద్దు చేయాలని తెలంగాణ విద్యార్థి పరిషత్ (టీజీవీపీ) నగర అధ్యక్షుడు అఖిల్ ఆధ్వర్యంలో శ్రీ చైతన్య పాఠశాల ముందు మంగళవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా అఖిల్ మాట్లాడుతూ.. శ్రీ చైతన్య కార్పొరేట్ పాఠశాల వారు బిల్డింగ్ పర్మిషన్ తీసుకొని రెండు బిల్డింగ్‌లలో క్లాసులు నిర్వహించడం జరుగుతుందన్నారు. కొత్త బిల్డింగ్‌కు ఎటువంటి పర్మిషన్లుగాని భద్రత ప్రమాణాలు గానీ మౌలిక సదుపాయాలు గాని లేవని, ఒక భవనంలో విద్యార్థులను ఉంచి క్లాస్ నిర్వహించడం జరుగుతుంది. శ్రీ చైతన్య పాఠశాలలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అరవింద్, ధనరాజ్, దేవ శంకర్, నవీద్, తదితరులు పాల్గొన్నారు.

నేడు తెలంగాణ వైద్యారోగ్య దినోత్సవం

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా బుధవారం నియోజకవర్గ స్థాయిలలో తెలంగాణ వైద్య ఆరోగ్య దినోత్సవం నిర్వహించనున్నట్టు కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలు, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల గురించి ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా అర్హులైన వారికి న్యూట్రిషన్ కిట్లను అందజేస్తారని కలెక్టర్ తెలిపారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు పండ్ల పంపిణీ కార్యక్రమం ఉంటుందన్నారు. ఉత్తమ సేవలందించిన వైద్యారోగ్య శాఖలోని వివిధ విభాగాలకు చెందిన ఉద్యోగులను సన్మానించడం జరుగుతుందన్నారు. అధిక సంఖ్యలో ప్రజలు, సిబ్బంది పాల్గొని వైద్యారోగ్య శాఖ దినోత్సవ కార్యక్రమాలు విజయవంతం చేయాలని కలెక్టర్ సూచించారు.

అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు

గ్రామీణ వైద్య రంగానికి ప్రాణ దీపికలు

- బిజెపి నాయకులకు మతం అడ్డం పెట్టుకొని, రాజకీయం చేయడం తప్ప ప్రజలకు చేసింది శూన్యం
- ఆర్టీసీ చైర్మన్, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మహిళా సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి కెసిఆర్ పెద్దపీట వేస్తున్నారని గృహలక్ష్మి పథకంలో భాగంగా మహిళల పేరుపైనే డబుల్ బెడ్ రూం కేటాయిస్తామని ప్రకటించారని, ఇది కేసీఆర్ కు మహిళలపై ఉన్న ప్రేమ ఆప్యాయతకు నిదర్శనమని, నామ మాత్రపు జీతాలతో ఆశా కార్యకర్తలు, అంగన్వాడిలు నాడు ఉండేవారని, నేడు గ్రామీణ వైద్య రంగానికి ప్రాణ దీపికలుగా ఉన్నారని ఆర్టీసీ చైర్మన్, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కెఎన్ఆర్ గార్డెన్ ఫంక్షన్ హాల్ లో తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మహిళ సంక్షేమ దినోత్సవం, మహిళ ఉద్యోగులకు సన్మానం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ.. చాలీ చాలని జీతాలతో నిత్య పోరాటాల అంగన్వాడీలు నాడు ఉండేవారని అన్నారు. కరోనా విలయతాండవం చేసిన సమయంలో ఆశ కార్యకర్తలు చేసిన సేవలు మర్చిపోలేనివని అన్నారు. గర్భిణి స్త్రీల నుండి మొదలుకొని ఇప్పుడు పుట్టే చిన్నారుల వరకు వారి ముందు ఉండి అన్ని కార్యక్రమాలను చేపట్టడం హర్షించదగ్గ విషయమని తెలిపారు. వారు చేస్తున్న సేవలకు కేసీఆర్ వేతనాలు పెంచే ఆలోచన చేసే అవకాశం ఉందని అన్నారు. కానీ బిజెపి పాలించే రాష్ట్రాల్లో ఇవేమీ అమలు అవుతలేవని, ఇక్కడ ఉన్న బిజెపి నాయకులు, మతం, రామున్ని అడ్డం పెట్టుకొని రాజకీయం చేయడం తప్ప ప్రజలకు చేసింది శూన్యమని తెలిపారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన ఆశ వర్కర్లకు రెండు నిమిషాలు మౌనం పాటించారు. త్వరలో 'గృహలక్ష్మి' పేరిట ఇల్లు నిర్మించుకునేందుకు రూ.3 లక్షల ఆర్థిక సాయం, మహిళల రక్షణకు షీ టీమ్స్, భరోసా కేంద్రాల ఏర్పాటు చేసిన రాష్ట్ర ప్రభుత్వం, గ్రామీణ మహిళలు ఆర్థికంగా ఎదగాలన్న ఉద్దేశంతో విలేజ్ ఎంటర్‌ప్రైజెస్ కార్యక్రమంతో వ్యాపారాలు చేసుకునేందుకు బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, గ్రామసంఘం నిధుల ద్వారా రుణాలను ఇస్తూ జీవనోపాధిని కల్పిస్తున్నదని వివరించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తొమ్మిదేండ్లలో పేదింటి ఆడబిడ్డల వివాహాలకు రూ.320 కోట్ల ఆర్థికసాయం అందజేసిందని, 29,162 మందికి కల్యాణలక్ష్మి పథకం కింద రూ.276కోట్లు, షాదీముబారక్ కింద 5,655 మంది లబ్ధిదారులకు రూ.52.16 కోట్ల ఆర్థికసాయం అందించిందని తెలిపారు ఒంటరి మహిళలకు ఆసరా పింఛను సౌకర్యం కల్పించి సీఎం కేసీఆర్ బతుకు మీద భరోసా కల్పించారని, వృద్ధులు, వితంతువుల కష్టాలను అర్థం చేసుకున్న కేసీఆర్ 2018లో పెన్షన్ రూ.100 నుంచి రూ.2016 అందించడం చాలా గొప్ప విషయమన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో అంగన్‌వాడీ టీచర్లకు రూ.4500, ఆయాలకు రూ.2 వేల వేతనం అందించేవారని, మూడు, నాలుగు నెలలకోసారి నెల జీతం అందించే వారన్నారు. తాజాగా పీఆర్సీ వర్తింపజేయడంతో టీచర్లకు రూ.13,650, ఆయాలకు రూ.7,800 వేతనాలు అందుతున్నాయి అని తెలిపారు. కార్యక్రమంలో యువ నాయకుడు జడ్పీ పిసి బాజిరెడ్డి జగన్ మోహన్, సిడిపిఓ స్వర్ణతల, నిజామాబాద్ ఆర్డిఓ రవి, ఉమ్మడి జిల్లాల ఐడీసీఎంఎస్ చైర్మన్ సాంబార్ మోహన్ , ఆర్డీవో రవి, ఎంపీపీ బాదవత్ రమేష్ నాయక్, జడ్పిటిసిలు దాసరి ఇందిరా లక్ష్మీ నర్సయ్య, వైస్ ఎంపీపీలు, ఆశ వర్కర్లు, ఏఎన్ఎం వర్కర్లు, అంగన్వాడి టీచర్లు, మహిళలు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, అధికారులు, ప్రజాప్రతినిధులు

అనుమతి లేని పాఠశాలలపై అధికారులు చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

అనుమతి లేని పాఠశాల కార్పొరేటు పాఠశాలలపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక నాయకులు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని టివియువి కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టివియువి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రమావత్ లాల్ సింగ్ మాట్లాడుతూ జిల్లాలో కార్పొరేట్ విద్యాసంస్థలు పుట్టగొడుగుల్లా వెలిసి స్థానిక విద్యార్థి తల్లిదండ్రులను ఐఐటీ నీట్ లాంటి మోసపూరిత ప్రకటనలు ర్యాంకుల తో మోసం చేస్తున్నారని ఆయా కార్పొరేట్ పాఠశాలలు ఈ విద్యా సంవత్సరం కూడా అక్రమ దారుల్లో నే పాఠశాలల తరగతులు నిర్వహిస్తున్న విద్యాశాఖ అధికారులు అటుపక్క కన్నెత్తి కూడా చూడడం లేదని ప్రభుత్వ అనుమతి లేని పాఠశాలల ను సీజ్ చెయ్యాలని అన్నారు. అడ్మిషన్ ఫీజు పేరిట అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నారని అన్నారు. ఈ విద్యా సంవత్సరం ప్రారంభంలోనే కార్పొరేట్ , ప్రైవేటు పాఠశాల అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని అన్నారు. పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సంబంధించి నటువంటి పుస్తకాలు దుస్తులు స్టేషనరీ సామాగ్రి తమ పాఠశాలలో మాత్రమే కొనాలని తల్లిదండ్రులను మానసికంగా ఒత్తిడికి గురిచేసి అధిక ధరలకు విక్రయిస్తున్నారని పాఠశాలలు ఉన్నది చదువుల కోసమా..? లేక వస్త్ర స్టేషనరీ వ్యాపారాల కోసమా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు మేల్కొని అనుమతులు లేని పాఠశాలలపై చర్యలు తీసుకొని సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో అనుమతి లేని పాఠశాలల ఎదుట ఆందోళన కార్యక్రమాలు చేస్తాం అని హెచ్చరించారు. సమావేశంలో టివియువి జిల్లా అధ్యక్షుడు అజయ్, భాస్కర్ పాల్గొన్నారు

కాంగ్రెస్‌పార్టీ పథకాలను వివరించాలి

మాజీ మంత్రి పి. సుదర్శన్ రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ-రెంజల్

కాంగ్రెస్ పార్టీ చేపట్టబోయే పథకాల గురించి వివరించాలని మాజీ మంత్రి పి. సుదర్శన్ రెడి అన్నారు. మండలంలోని నీల గ్రామంలో మంగళవారం కాంగ్రెస్ బూత్ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక మెజార్టీతో అధికారంలోకి వస్తుందని అన్నారు. బడుగు, బలహీన వర్గాల అభివృద్ధితోపాటు రైతుల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ విశేషంగా కృషి చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి, ఎడపల్లి మండల అధ్యక్షులు పులి శ్రీనివాస్, రెంజల్ మండలం కాంగ్రెస్ సీనియర్ నాయకులు జావిద్ ఉద్దీన్, బీసీ సెల్ మండల అధ్యక్షులు నితిన్, గంగా కృష్ణ, ఎం ఎల్ రాజు, సొక్కుల సాయిలు, సద్దాం, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను పరామర్శ


పరామర్శిస్తున్న సునీల్‌రెడ్డి

నవతెలంగాణ-భీంగల్

మండలంలోని బెజ్జోర, బడా భీంగల్ గ్రామాలకు చెందిన బాధిత కుటుంబాలను ఆరేంజ్ ట్రావెల్స్ అధినేత ముత్యాల సునీల్ రెడ్డి పరామర్శించారు. బెజ్జోర గ్రామానికి చెందిన రాజేశ్వర్ తలపై ఇటుకపడి మరణించడంతో మంగళవారం వారి కుటుంబాన్ని పరామర్శించి వారికి ఉపాధి నిమిత్తం కిరాణంషాపు నడిపించుకోవడానికి ఆర్థికసాయం అందజేస్తానని హమీ ఇచ్చారు. అలాగే అదే గ్రామానికి చెందిన రాజుగౌడ్ మరణించడంతో వారి కుంటుంబాన్ని కూడ పరామర్శించి మనోదైర్యాన్ని కల్పించారు అమెరికాలోని న్యూ జెర్సీలో ప్రమాదంతో మరిణించిన గుర్రపు శైలేష్, సౌదీలో మృతి చెందిన గ్రామానికి చెందిన రాజేంధర్ కుటుంబాన్ని పరామర్శించారు. ఈయన వెంట సునీల్ యువసేన నాయకులు ఉన్నారు.

ఐటిఐ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-భీంగల్

పట్టణకేంద్రంలోని ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో వివిధ కోర్సులకు దరఖాస్తులు అహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులను పోన్ నెంబర్, పదవ తరగతి మెమో, బోనఫైడ్, కులం సర్టిఫికెట్, మరియు ఈమెల్ ఐడితో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. పూర్తివివరాలకు కళాశాలలో సంప్రదించాలని తెలిపారు

రామాంజనేయ స్వామి దేవాలయ ప్రారంభోత్సవం


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-సిరికొండ

మండలంలోని న్యావనంది గ్రామంలో 45 లక్షల నిధులతో నిర్మించిన శ్రీ రామాంజనేయ స్వామి దేవాలయంను మంగళవారం ప్రారంభించిన రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్, నిజామాబాద్ రూరల్ గ్రామీణ శాసనసభ్యులు బాజిరెడ్డి గోవర్ధన్ ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము దేవాదాయ ధర్మాదాయ శాఖ నిధులతో మందిరం నిర్మించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ దయ వల్ల చుట్టుపక్కల గ్రామాలను, తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయడం వల్ల, అందరికీ సులభంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీపీ సంగీత రాజేందర్ , జడ్పిటిసి మాన్సింగ్ నాయక్ , మండల అధ్యక్షులు శ్రీనివాస్ , వైస్ ఎంపీపీ తోట రాజన్న , స్థానిక సర్పంచ్ కనక శ్రీనివాస్ , ఎంపిటిసి రమేష్ , వివిధ గ్రామాలకు చెందిన సర్పంచులు, ఉపసర్పంచ్లు, ఎంపిటిసిలు, రైతు సమన్వయ సమితి అధ్యక్షులు, సొసైటీ చైర్మన్లు, సొసైటీ డైరెక్టర్లు, కార్యకర్తలు, నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

విద్యార్థులకు సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి

పీడీఎస్‌యూ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో పున్హ ప్రారంభమైన సందర్భంగా విద్యార్థులకు సమస్యలు స్వాగతం పలుకుతున్నాయనీ సమస్యలు పరిష్కరించాలని జిల్లా విద్యా శాఖ అధికారికి పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పిడిఎస్యు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.నరేందర్, కర్క గణేష్ లు మాట్లాడుతూ జిల్లాలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయనీ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టుగా పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, తరగతి గదులు, మౌలిక సదుపాయాలు లేకపోవడం సిగ్గుచేటన్నారు. తాగునీరు, సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులు లేకపోవడం దారుణమని అన్నారు. మన ఊరు మన బడి పథకం కింద జరుగుతున్న పనులను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల స్థలాలు కబ్జాకు గురవుతున్నాయనీ వాటిని కాపాడాలని తెలిపారు. మధ్యాహ్నం భోజన పథకం మెనూ ప్రకారం అమలు చేయాలని డిమండ్ చేశారు. విద్యార్తుల సంఖ్య పరంగా మూత్ర శాలలు లేకపోవడం సిగుచేటన్నారు. వెంటనే ప్రభుత్వ పాఠశాలలోని సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కోట్లాది రూపాయలను దశాబ్ది ఉత్సవాల పేరిట ప్రజాధనాన్ని నీటిపాలు చేస్తున్నారని, ప్రభుత్వం పేద బడుగు బలహీన వర్గాలను చదువుతున్న ప్రభుత్వ విద్యా సంస్థలలో కేటాయించకపోవడం సిగ్గుచేటని అన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేస్తారని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఎస్కే అశుర్,అనిల్ నాయకులు నవీన్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఓబి పనుల్లో వేగం పెంచండి

- కాంట్రాక్టర్ పని చేయకపోతే బ్లాక్ లిస్టులో పెట్టండి
- ఎన్ఎచ్ డిప్యూటీ ఈఈ పై ఎంపీ అర్వింద్ ఆగ్రహం

నవతెలంగాణ-మాక్లూర్


మాట్లడుతున్న ఎంపీ

మండలం లోని అడివి మామిడిపల్లి అర్ఓబి నిర్మాణ పనులను ఎంపీ అర్వింద్ ఆకస్మికంగా పర్యవేక్షించారు. పార్ల మెంట్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆర్మూర్లో ఏర్పాటు చేసిన సమా వేశానికి హాజరయ్యేందుకు మంగళవారం నిజామాబాద్ నుండి వెళ్తుండగా మార్గమధ్యంలో అడవి మామిడిపల్లి ఆర్ఓబి 802 నిర్మాణ పనులను పరిశీలించారు. ప్రభుత్వ నిర్మాణాల మీద బిఆర్ఎస్ నాయకులు దేశ్ కీ నేతా కేసీఆర్, జీవనన్న ఆర్మూర్ వంటి రాతలు రాయడం పట్ల ఆయన వ్యంగ్యంగా స్పందించారు. కేసీఆర్ పురుషుడని,దేశ్ కీ నేతా కాదని, ఒకవేళ భవిష్యత్తులో ఎపుడైనా అయినా దేశ్ కీ నేతా కాదని, దేశ్ కా నేతా అనాలని ఆ సంగతి కూడా ఎమ్మెల్యే, బీఆర్ ఎస్ నాయకులకు తెలియకపోతే ఎలా అని ఎద్దేవా చేశారు. 100శాతం కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన ఆర్ఓబి నిర్మాణానికి కేంద్రం 14 కోట్లకు పైగా నిధులు రాష్ట్ర ప్రభుత్వానికి ఎప్పుడో అందజేసినా పనులు నెమ్మదిగా కొనసాగడం పట్ల ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం డిప్యూటీ ఈఈ శంకర్ కి చరవాణిలో పనులు మందకొడిగా కొనసాగుతున్నాయని, కాంట్రాక్టర్ ల మీద పర్యవేక్షణ చేయకుండా ఏం చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. నాలుగైదు నెలల క్రితం తాను చేసిన రివ్యూ లోనే పనులు నెమ్మదిగా చేస్తున్న సంబంధిత కాంట్రాక్టర్ను బ్లాక్ లిస్టులో పెట్టాలని సూచించానని , ఇప్పటివరకు చర్యలు ఎందుకు తీసుకోలేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.డిప్యూటీ ఈఈ సమాధానంపై సంతృప్తి చెందని ఎంపీ ఈఈ కాంతయ్యకి ఫోన్ చేసి, వాస్తవ పరిస్థితులు వివరించగా, రానున్న వారం రోజుల్లో పనులు ఊపందుకుంటాయని ఈఈ వివరించగా, వారం వారం చేసిన పని ప్రగతిని తనకు అందజేయాలని ఎంపీ ఆదేశించారు.

పాఠశాలలకు పాఠ్య పుస్తకాల సరఫరా

నవతెలంగాణ-బోధన్


పుస్తకాలు అందజేస్తున్న ఎంఈవో

జూన్ 12 నుంచి పాఠశాలలు పున్హ ప్రారంభం కావడంతో ప్రభుత్వం తొలిరోజే ఆయా మండలాలకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేసింది. దీంతో మంగళవారం బోధన్ మండల విద్యాధికారి కార్యాలయం నుండి పాఠ్య పుస్తకాలను మండలంలోని కల్దుర్కి, అందాపూర్ , బీటి నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ పరిధి లోని ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజు, వసంత్, జగదీష్, సునీత సిఆర్పిలు బాబు, విజయ్, షఫీ, శివానంద, అరవింద్ లు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ మహిళ సంక్షేమ ప్రభుత్వం

- హామీమేరకు బీడీ కార్మికులు, ఒంటరి మహిళలకు పింఛన్లు
- మహిళలకు స్టార్టప్ కేంద్రంగా వీహబ్ తెలంగాణ మహిళ సంక్షేమ
- దినోత్సవంలో ఎమ్మెల్యే బిగాల గణేష్

నవతెలంగాణ-కంఠేశ్వర్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్త

బీఆర్ఎస్ మహిళ సంక్షేమ ప్రభుత్వమని, హామీలకు అనుగుణంగా బీడీ కార్మికులకు, ఒంటరి మహిళలకు పింఛన్లు అందిస్తున్నారని, మహిళలకు స్టార్టప్ కేంద్రంగా వీహబ్‌లను ఏర్పాటుచేసిందని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్త అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శ్రీరామ గార్డెన్స్‌లో తెలంగాణ మహిళ సంక్షేమ దినోత్సవంలో మంగళవారం పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. స్వరాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో మహిళ సంక్షేమానికి, మహిళల భద్రత, మహిళల రక్షణకు అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నారని తెలిపారు. మహిళలకు ఇచ్చిన హామీ ప్రకారం ఒంటరి మహిళలకు, బీడీ కార్మికులకు ముఖ్యమంత్రి కేసీఆర్ పింఛన్లు అందిస్తున్నారని, మహిళలకు అన్ని రంగాల్లో రాణించడడానికి వివిధ రకాల కార్యక్రమాలు ప్రభుత్వం అమలు చేస్తుందని అన్నారు. .మహిళలు ఆర్థికంగా వృద్ధి సాధించాలని మహిళ వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసిందని, ప్రభుత్వంమహిళలలో దాగివున్న ప్రతిభను వెలికితీసి సరికొత్త ఆవిష్కరణలు, పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి వి-హబ్ కేంద్రాలను ఏర్పాటు చేసింది ప్రభుత్వం.దేశంలో మొట్ట మొదటిసారిగా షి టాక్సీ పథకం ద్వారా మహిళ ప్రయాణికుల భద్రత కల్పించడం కోసం, మహిళలు ఆర్థికంగా వృద్ధి సాధించడానికి మహిళలకు డ్రైవింగ్ లో శిక్షణ అందించి సబ్సిడిలో వాహనాలు అందిస్తుందన్నారు. గర్భిణీ స్త్రీలు పౌష్టికాహారం లోపంతో బాధపడకుండా గర్భిణీ స్త్రీలకు, పిల్లల పోషణ కోసం ఆరోగ్యలక్ష్మి పథకం ప్రారంభించిందన్నారు. తద్వారా పిల్లలలో,తల్లులలో రక్త హీనత,పౌష్టికాహారం లోపం వాటిల్లకుండా మాత శిశు మరణాలు తగ్గాయని తెలిపారు. . అంగన్ వాడి సిబ్బంది శ్రమని గుర్తించిన ముఖ్యమంత్రి కేసీఆర్ వేతనాలు పెంచి వారి జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. బస్తి ధవాఖానాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలలో మహిళలకోసం మహిళ క్లినిక్ ఏర్పాటు చేసిందని తెలిపారు. ప్రభుత్వం క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలతోపాటు ఇతర రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తుందన్నారు. గర్భిణి స్త్రీ ల ఆరోగ్య స్థితి ని తెలుసుకోవడం కోసం ఆశ వర్కర్లను ఇంటికి పంపి అవసరమైన వైద్య సహాయాన్ని ప్రభుత్వం అందిస్తుందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవం జరిగితే 12000 రూ.కేసీఆర్ కిట్ ని అందిస్తుందని తెలిపారు.

ప్రభుత్వం.ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకవచ్చిన వైద్య సదుపాయాలు, సంక్షేమ పథకాల వల్ల, దేశంలోనే అత్యధికంగా ప్రసవాలు తెలంగాణ లోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో జరుగుతున్నాయని అన్నారు. గురుకుల పాఠశాలల ద్వారా సంవత్సరానికి 1 లక్షల 20 వేలు ఖర్చు చేస్తూ నాణ్యమైన విద్యను అందిస్తుందని తెలిపారు. మహిళలకు సంక్షేమానికి,భద్రతకు, రక్షణకు కృషి చేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌కు మనందరం మద్దతు తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ దండు నీతూ కిరణ్, రాష్ట్ర మహిళ కమిషన్ సభ్యురాలు సూదం లక్ష్మీ, ప్రభుత్వ ఆసుపత్రి పర్యవేక్షకురాలు ప్రతిమ రాజ్ రెడ్డి, నుడ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, కార్పొరేటర్లు, బీఆర్ఎస్ మహిళ విభాగం అధ్యక్షురాలు గంగమని,మెప్మా సిబ్బంది, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది,మహిళ స్త్రీ శిశు సంక్షేమ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రంలో సీఎం కేసీఆర్ కుటుంబం అవినీతి పాలన

- రాజ్యసభ సభ్యులు ప్రకాష్ జవదేకర్

నవతెలంగాణ-ఆర్మూర్


మాట్లాడుతున్న ప్రకాష్ జవదేకర్

తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబం అవినీతి పాలన సాగుతుందని రాజ్యసభ సభ్యులు, కేంద్ర మాజీ మంత్రి ప్రకాష్ జవదేకర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని క్షత్రియ కల్యాణ మండపంలో నియోజకవర్గ మోర్చాల సంయుక్త సమ్మేళన కార్యక్రమం నియోజకవర్గ కన్వీనర్ పాలుపురాజు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ కేంద్ర మంత్రి, ప్రస్తుత రాజ్యసభ సభ్యులు ప్రకాష్ జవదేకర్ విచ్చేసి మాట్లాడుతూ... ప్రధాని మోడీ చేస్తున్న అభివృద్ధి విషయంలో ప్రతిపక్షాలు సైతం విమర్శించ లేని పరిస్థితుల్లో ఉన్నాయని అన్నారు. ప్రపంచంలో ఈ దేశం గొప్పతనాన్ని తెలియజేస్తున్నారని, చివరికి అమెరికా రాష్ట్రపతి సైతం భారత ప్రధాని నరేంద్ర మోడీని బాస్ మోడీ అని పిలిచారని తెలిపారు. దేశాన్ని 200ఏండ్లు పాలించిన బ్రిటిష్ దేశం సైతం ఈరోజు భారతదేశ ఆర్థిక స్థితి కన్నా తక్కువ స్థాయిలో ఉందని అన్నారు. కరోనా సమయంలో ఉచిత వ్యాక్సిన్ ఇవ్వడం, కిసాన్ సన్మాన్‌నిధి కింద రైతులను ఆదుకోవడం, ఉచితంగా ఎల్పిజి కలెక్షన్లు, 80కోట్ల మంది బీద వారికి ఉచితంగా రేషన్, 40 కోట్ల మందికి ముద్రలోన్, 11 కోట్ల మందికి సౌచాలయాల నిర్మాణం, 3 కోట్ల మందికి కరెంట్ కనెక్షన్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ విధంగా "సబ్ కా సాత్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్, సబ్ కా ప్రయాస్" అనే సూత్రంతో ముందుకు వెళ్తుంటే కేసీఆర్ మాత్రం మోడీని తిడుతూ ఉంటాడని. అవినీతి అక్రమాలు తప్ప అభివృద్ధి లేదని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రంలో ఏ పని చేయాలనుకున్నా డబ్బులు ఇవ్వడం, పనికి పర్సంటేజీలు ఇవ్వడం సర్వసాధారణమైపోయిందని, తెలంగాణ సర్కార్ 60శాతం కమిషన్ సర్కారుగా కొనసాగుతుందని విమర్శించ్చారు. నరేంద్రమోడీ 140 కోట్ల మంది తమ కుటుంబ సభ్యులుగా అనుకుంటే కేసీఆర్ మాత్రం తన కుటుంబమే ముఖ్యం అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని అన్నారు. కేసీఆర్ ఇచ్చినటువంటి హామీలు డబుల్ బెడ్ రూమ్, దళితులకు మూడు ఎకరాలు, నిరుద్యోగ యువతకు 3వేల రూపాయలు, గిరిజనులకు రెండు ఎకరాలు ఇచ్చాడా అని ప్రశ్నించారు. ప్రతి జిల్లా కేంద్రంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, రైతులకు ఏకకాలంలో లక్ష రూపాయలు రుణమాఫీ, కేజీ టు పీజీ ఉచిత విద్య అందించాడా.. అని ప్రశ్నించారు. కార్యకర్తలు కాదు.. కాదు..లేదు .. లేదు.. అని సమాధానం ఇచ్చారు. మాయమాటలు తప్ప ఏ ఒక్క హామీ నెరవేర్చని వ్యక్తి కెసిఆర్ కాబట్టి కచ్చితంగా తెలంగాణలో బిజెపి వస్తుంది.. కేసీఆర్ పోతుండు అని అన్నారు. ప్రతి కార్యకర్త మూడు ఇండ్లకువెళ్లి బిజెపి 9 సంవత్సరాలు చేసిన అభివృద్ధిని వివరించాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పార్లమెంటు సభ్యులు ధర్మపురి అరవింద్, నాయకులు బస్వా లక్ష్మీనారాయణ, అల్జాపూర్ శ్రీనివాస్, పల్లె గంగారెడ్డి, పైడి రాకేష్ రెడ్డి, వినయ్ రెడ్డి, పెద్దోళ్ల గంగారెడ్డి, ఆలూరు విజయభారతి పాలెపు రాజు, జెస్సు అనిల్ తదితరులు పాల్గొన్నారు.

బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా డాక్టర్ ఏలేటి మల్లికార్జున్ రెడ్డి

నవతెలంగాణ-కమ్మర్ పల్లి

భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా మండలంలోని చౌట్‌పల్లి గ్రామానికి చెందిన బాల్కొండ నియోజకవర్గ బిజెపి నాయకులు డాక్టర్ ఏలేటి మల్లికార్జున్ రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం బిజెపి రాష్ట్ర అధ్యక్షులు, ఎంపీ బండి సంజయ్ కుమార్ బిజెపి రాష్ట్ర కార్యవర్గాన్ని విస్తరించారు. రాష్ట్ర పార్టీ సంస్థాగత విస్తరణలో భాగంగా అన్ని సామాజిక వర్గాలు, భౌగోళిక అంశాలను పరిగణలోకి తీసుకొని 125 మందితో రాష్ట్ర కార్యవర్గాన్ని బండి సంజయ్ కుమార్ విస్తరించారు. ఇందులో డాక్టర్ ఏలేటి మల్లికార్జున్ రెడ్డికి అవకాశం దక్కడం పట్ల బిజెపి మండల అధ్యక్షులు కట్ట సంజీవ్ కుమార్, నాయకులు కొత్తపల్లి అరుణ్ కుమార్, కుంట భూమారెడ్డి, పలువురు నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

బీఆర్ఎస్ అవినీతిని ప్రచారం చేయాలి


మాట్లాడుతున్న నవీన్

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఎల్లారెడ్డి నియోజకవర్గ కో ఆర్డినెటర్ లతో రాష్ట్ర కో ఆర్డినెటర్ నవీన్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోషల్ మీడియా ద్వారా కాంగ్రెస్ చేస్తున్న కార్యక్రమాలు ప్రతి ఒక్కరికి చేరేలా కృషి చేయాలని సూచించారు. బిఆర్ఎస్ పార్టీ చేస్తున్న అవినీతి ప్రతి ఒక్కరికి చేరేలా చేయాలన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైనా సోషల్ మీడియా కో ఆర్డినెటర్ లకు నియామక పత్రాలను అందజేశారు.

ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ-పిట్లం

ఓటు హక్కు కోసం 18 సంవత్సరాలు నిండిన యువతి , యువకులు ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని తహసిల్దార్ రామ్మోహన్ రావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఓటర్ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఓటు హక్కు లేని యువతి , యువకులు తమ ఓటు హక్కు నిమిత్తం తమ గ్రామ, మండల బి ఎల్ ఓ లకు దరఖాస్తులు చేసుకోవాలని అన్నారు. ఓటు హక్కు లో ఏమైనా తప్పులుంటే సవరణ చేసుకోవాలని సూచించారు. ఓటు హక్కు లేని దివ్యాంగులు సైతం దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. వారం రోజులపాటు నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో బి ఎల్ ఓ ల తో పాటు వివో ఏ లు గ్రామ, మండల స్థాయిలో ఇంటింటికి పర్యవేక్షిస్తారని , ఓటు హక్కు లేనివారు , తప్పులున్న ఓటర్లు ఓటు నమోదు బృందానికి సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బి ఎల్ ఓ సాయిలు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే రైతుల సంక్షేమం


జొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న సర్పంచ్

నవతెలంగాణ-పిట్లం

బీఆర్ఎస్ పార్టీతోనే రైతులకు సంక్షేమ పథకాలు అమలవుతాయని సర్పంచ్ నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని అల్లాపూర్ గ్రామంలో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల లబ్ధి కోసం వారు పండించిన పంటలన్నింటినీ కెసిఆర్ ప్రభుత్వం మద్దతు ధరలు కల్పించి కొలుగోలు చేస్తుందన్నారు. ఈ తరహాలో రైతులు యాసంగి సీజన్‌లో పండించిన జొన్నలను దళారులకు విక్రయించి నష్టపోకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలోనే విక్రయించి లబ్ధి పొందాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతుబంధు అధ్యక్షుడు అంబారెడ్డి, బారోసా అధ్యక్షుడు రాములు, సొసైటీ డైరెక్టర్ సాయిలు, ఉప సర్పంచ్ వెంకట్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మదన్‌హిప్పర్గకు బస్సు నడపండి

- డిపో మేనేజర్‌కు సర్పంచ్ వినతి


డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్, గ్రామస్తులు

నవతెలంగాణ-మద్నూర్

డోంగ్లి మండలంలోని మాదన్‌హిప్పర్గ గ్రామానికి బాన్సువాడ డిపో నుండి బస్సును నడపాలని డిమాండ్ చేస్తూ ఆ గ్రామ ప్రజలు గ్రామ సర్పంచ్ రాజు పటేల్ ఆధ్వర్యంలో బాన్సువాడ డిపో మేనేజర్‌కు మంగళవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ రాజు పటేల్ మాట్లాడుతూ మదన్‌హిప్పర్గకు డోంగ్లి మీదుగా మోగా, మేనూర్, మద్నూర్ నుండి దెగ్లూరుకు బస్సును నడపాలని కోరారు. ఉదయం ఎనిమిది గంటలకు మాదన్ ఇప్పర్గా గ్రామానికి బస్సు వచ్చే విధంగా చూడాలని మళ్ళీ మధ్యాహ్నం ఒంటిగంటకు ఆ తర్వాత తిరుగు ప్రయాణం సాయంత్రం నడిచే విధంగా బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. బస్సు సౌకర్యాన్ని ఈనెల 15వ తేదీ నుంచి ప్రారంభించాలని కోరారు.

విద్యార్థులకు యూనిఫాంలు అందజేత


యూనిఫాంలు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

నవతెలంగాణ-రాజంపేట్

తెలంగాణ ప్రభుత్వం వారి ఆదేశాల మేరకు రాజంపేట్‌లోని విద్యా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం 2023-24 విద్యా సంవత్సరం భాగంగా మండలంలోని ప్రభుత్వ పాఠశాలలలో చదువుతున్న విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ, ఉచిత ఏకరూప దుస్తుల (యూనిఫాంల) పంపిణీ కార్యక్రమం నిర్వహించినట్టు మండల విద్యాధికారి రామస్వామి తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజంపేట్ మండల ఎంపీపీ స్వరూప కృష్ణమూర్తి, జడ్పిటిసి కొండ హనుమాన్లు, కొండాపూర్ సర్పంచ్ స్వాతి, ఆరుగొండ సర్పంచ్ లక్ష్మీ, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు లక్ష్మీనారాయణ, సుమలత, వసంత, సిఆర్పిలు లింగం, సాయరెడ్డి, సూర్య పాల్, రమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నసురుల్లాబాద్ బ్యాంక్ మేనేజర్‌కు సన్మానం


బ్రాంచ్ మేనేజర్‌ను సన్మానిస్తున్న సొసైటీల కార్యదర్శులు

నవతెలంగాణ నసురుల్లాబాద్

జిల్లా కో-ఆపరేటివ్ బ్యాంక్ (డిసిసిబి) నసురుల్లాబాద్ మేనేజర్ రాకేష్ గత 4 సంవత్సరాల నుండి విశిష్ట సేవలు అందిస్తూ, నిజామాబాద్ మేన్ బ్రాంచుకు బదిలీపై వెళ్లడంతో నసురుల్లాబాద్ మండలం బ్యాంకు పరిధిలో ఉన్న ఐదు సొసైటీల కార్యదర్శులు మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయా సొసైటీల కార్యదర్శులు మాట్లాడుతూ సహకార బ్యాంకు లో ప్రజల మన్ననలను పొందుతూ, ప్రజలకు సేవలందించడంలో ఆయన ఎల్లప్పుడు ముందున్నారని అన్నారు. రైతులకు ప్రజలకు సేవలు అందిస్తూ మరెన్నో ఇలాంటి సన్మానాలు పొందాలని వారు కోరారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ రాకేష్ మాట్లాడుతూ బ్యాంక్ అభివృద్ధికి కృషి చేసిన ఖాతాదారులకు సహకార సొసైటీ కార్యదర్శులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం కార్యదర్శులు గంగారం దుర్కి, శ్రీనివాస్ నసురుల్లాబాద్, మోహన్, నాచుపల్లి నరేందర్ మైలారం, బ్యాంక్ సిబ్బంది సహకార సంఘం సిబ్బంది తదితరులు ఉన్నారు.

కేసీఆర్ పాలనలో మహిళల సంక్షేమం.. ఆర్థికాభివృద్ధి

- మహిళా సంక్షేమ దినోత్సవ సభలో ఎమ్మెల్యే జాజల సురేందర్
- అన్ని రంగాల్లో వారు ఆదర్శం కలెక్టర్ జితేశ్ వి పాటిల్



మహిళల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పథకాల బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెలే, కలెక్టర్, అధికారులు, ప్రజాప్రనిధులు.. హాజరైన మహిళలు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

మహిళల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని ఎల్లారెడ్డి శాసనసభ్యుడు జాజుల సురేందర్ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా మంగళవారం పట్టణ కేంద్రంలో తెలంగాణ మహిళా దినోత్సవం కార్యక్రమంలో ఎమ్మెల్యే జాజుల సురేందర్, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని బాలికల పాఠశాలలో మహిళా బోనాలతో ఎమ్మెల్యే జాజల సురేందర్ కి స్వాగతం పలికారు. ఎమ్మెల్యే స్వయంగా బోనం ఎత్తుకొని నల్ల పోచమ్మ మందిరం వరకు ఎత్తుకెళ్లారు. అనంతరం ఎమ్మెల్యే జాజల సురేందర్ , జిల్లా కలెక్టర్ ప్రజా ప్రతినిధులు కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ మహిళల వల్లనే రాష్ట్రం దేశం ప్రపంచం అన్ని విధాలుగా ముందుకు వెళ్తుంది అని తన విజయం వెనుక తన తల్లి ఉంది అని గుర్తు చేసుకున్నారు. ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల్లో పోషకాహార పదార్థాలు అందిస్తున్నారని మహిళ ల రక్షణ కోసం షి టీమ్ ఎల్లవేళలా పనిచేస్తుంది అని తెలిపారు. కామారెడ్డి జిల్లా మహిళలు అందిరికి ఆదర్శంగా నిలుస్తారు అని తనకు నమ్మకం ఉంది అని అందులో లింగంపేట్, సదాశివ నగర్ మహిళలు ముందు వున్నారు అని గంగు భాయి , నిర్మల అనే ఇద్దరు మహిళలు వ్యవసాయంతో పాటు చేపల పేపకం చేస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు.

అనంతరం ఎమ్మెల్యే జాజుల సురేందర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం అన్ని రంగాల్లో మహిళలకు సామూహిక స్థానం కల్పిస్తూ వారి అభివృద్ధికి తోడ్పాటును అందిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. వైద్య రంగంలో ఆశ వర్కర్లు,గర్భిణీ స్త్రీలు, బాలింతలు, చిన్నారుల సంరక్షణలో అంగన్వాడీ టీచర్లు అందిస్తున్న సేవలు ఎనలేనివని కొనియాడారు. విద్య ఉద్యోగం రాజకీయ రంగాలలో స్థానిక చట్టసభలలో అవకాశాలు కల్పిస్తూ వారి హక్కులను కాపాడుతున్నట్లు చెప్పారు తల్లి పుట్టబోయే బిడ్డ ఇద్దరు ఆరోగ్యంగా ఉండాలని ఆలోచనతో కామారెడ్డి జిల్లాలోని న్యూట్రిషన్ కిట్లను ప్రారంభించడం జరిగిందన్నారు. అంగన్వాడి కేంద్రాలలో బాలింతలకు గర్భిణీ స్త్రీలకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా గుడ్లు పాలు బాలామృతం వంటి పౌష్టికాహారం అందిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. అంగన్వాడీ టీచర్ల గౌరవించడం కూడా రాష్ట్ర ప్రభుత్వం వచ్చిన తర్వాత 30 శాతం పెంచి వారి గౌరవాన్ని మరింత పెంచినట్టు తెలిపారు. ముఖ్యమంత్రి కెసిఆర్ దేశంలోనే ఎక్కడలేని విధంగా మహిళలల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని అన్నారు. కళ్యాణ లక్ష్మి, కెసిఆర్ కిట్, షాదీ ముబారక్ వంటి పథకాలను తీసుకువచ్చి మహిళల సవలంబన కోసం వారి సాధికారత కోసం కృషి చేస్తున్న సీఎం కేసీఆర్ అసలైన మహిళా బంధువుగా నిలిచారని అన్నారు. ఈ కార్యక్రమనికి ఎల్లారెడ్డి డి ఎస్పీ శ్రీనివాస్ లు ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి ఎంపీపీ మాధవి, లింగంపేట్ జడ్పిటీసీ శ్రీలత సంతోష్ రెడ్డి, గాంధారి జడ్పిటీసీ శంకర్ నాయక్, లింగంపేట్ ఎంపిపి గారిబున్నిసా, ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, కమిషనర్ జీవన్, సీడీపీఓ పద్మ , ఆయా గ్రామాల సర్పంచ్ లు, ప్రజా ప్రతినిధులు, బి ఆర్ ఎస్ కార్యకర్తలు,అంగన్వాడీ టీచర్లు, ఏ ఎన్ ఎం లు పాల్గొన్నారు.

సంక్షేమ సభకు తరలిన అంగన్‌వాడీలు, ఆశాలు


వేడుకలకు తరలిన మహిళలు

నవతెలంగాణ-మద్నూర్/సదాశివనగర్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తుంది. ఈ ఉత్సవాల్లో భాగంగా మంగళవారం జుక్కల్ నియోజకవర్గం స్థాయి మహిళా సంక్షేమ దినోత్సవాన్ని నియోజకవర్గంలోని పెద్ద కోడప్గల్ మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమానికి మద్నూర్ మండలం నుండి అంగన్వాడి టీచర్లు ఆశా వర్కర్లు ఐకెపి మహిళా సంఘాల సభ్యులు భారీ సంఖ్యలో తరలి వెళ్లారు. ప్రభుత్వ ఆదేశాలనుసారంగా మహిళ సంక్షేమ దినోత్సవానికి మండలం నుండి వివిధ శాఖల్లో పని చేసే మహిళలు అధికారులు పెద్ద కొడప్‌గల్ మండల కేంద్రానికి తరలి వెళ్లారు.

సదాశివనగర్: మహిళల సంక్షేమ దినోత్సవం సందర్భంగా సదాశివనగర్ నుండి డ్వాక్రా సంఘాల ఆధ్వర్యంలో మహిళలు మంగళవారం పెద్దఎత్తున తరలివెళ్లారు. దశాబ్ది ఉత్సవాలల్లో భాగంగా ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని ఎల్లారెడ్డి మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సదాశివనగర్, అడ్లూర్ ఎల్లారెడ్డి నుండి మహిళలు వాహనాలపై మంగళవారం బయలు దేరారు. వీరిని ఎ.పి.యం.రాజిరెడ్డి. సి.సిలు ఎల్లారెడ్డి కి తీసికెళ్ళినట్లు తెలిపారు.

గురుకులంలో దశాబ్ది వేడుకలు


దోమకొండలో జెండా ఆవిష్కరణ

నవతెలంగాణ-భిక్కనూర్/దోమకొండ

మండలంలోని సిద్ధి రామేశ్వర్ నగర్ గ్రామ శివారులో ఉన్న ప్రభుత్వ గురుకుల కళాశాలలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం కళాశాల ఆవరణలో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ జనగామ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఎగరవేశారు. అనంతరం కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది మానవహారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ నర్సింహారెడ్డి మాట్లాడుతూ ఎందరో అమరవీరుల ప్రాణ త్యాగం వల్ల రాష్ట్రం సిద్ధించి దశాబ్ది ఉత్సవాలు నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.


భిక్కనూర్‌లో మానవహారం

దోమకొండ: మండల కేంద్రంలోని గుండ్ల చెరువు సమీపంలో సోషల్ వెల్ఫేర్ మహిళా గురుకుల పాఠశాలలో తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా మంగళవారం పాఠశాలలో జడ్పిటిసి తీగల తిరుమల గౌడ్, ప్రజా ప్రతినిధులు జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీవితంలో మంచి లక్ష్యాన్ని ఎంచుకోవాలని కష్టపడి చదివి ఎంచుకున్న లక్ష్యాన్ని చేరు కోవాలన్నారు. మహిళ లు జాగ్రత్తలు వహించాలని, చదువులలో, క్రీడల్లో ధైర్యంగా ముందుకు సాగాలని సూచించారు. జీవితంలో కష్టపడి ఉన్నత స్థానంలో నిలిచి తల్లిదండ్రుల తో పాటు ఉపాధ్యాయుల పేరును గర్వంగా చెప్పుకునేలా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కానుగంటి శారద నాగరాజు, సర్పంచ్ నల్లపు అంజలి శ్రీనివాస్, ప్రిన్సిపాల్ శివరాం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కళ్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ


చెక్కులు అందజేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

నవతెలంగాణ-లింగంపేట్

మహిళా సంక్షేమ దినోత్సవం పురస్కరించుకొని శతాబ్ది ఉత్సవాలు భాగంగా మంగళవారం ఎల్లారెడ్డి మండల కేంద్రంలోని ముత్యాల ఫంక్షన్ హాల్లో జరిగిన ఉత్సవాలల్లో లింగంపేట మండలంలోని పలువురికి కల్యాణ లక్ష్మి ముఖ్యమంత్రి సహాయ నిధి కింద ఎల్లారెడ్డి శాసనసభ్యులు సురేందర్ జిల్లా కలెక్టర్ జితీష్ వి పాటిల్ చేతుల మీదుగా లబ్దారులకు చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, జడ్పిటిసి ఏలేటి శ్రీలత సంతోష్‌రెడ్డి, ఎంపీపీ గరీబున్నీసా నహీం, లింగంపేట్ సర్పంచ్ బొల్లు లావణ్య, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు దివిటీ రమేష్ ఎంపీటీసీ దేవేందర్ మాజీ ఎంపీపీ ముధం సాయిలు, సర్పంచులు రామ్‌రెడ్డి, ఆకుతోట నర్సమ్మ ప్రకాష్, మమత, పద్మ పోచయ్య, సాయి కిరణ్, బన్నీ సక్రు మిసాయి గౌడ్ రవీందర్ సత్యనారాయణ, ఆయా గ్రాముల సర్పంచులు ఎంపీటీసీలు గ్రామ కమిటీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

ఫిట్‌నెస్ లేని బస్సులను సీజ్ చేయాలి


వినతిపత్రం అందజేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా ఫిట్ నేస్ లేని ప్రైవేట్ విద్యాసంస్థల బస్సులను తనిఖీలు నిర్వహించి సీజ్ చేసి ఆయా విద్యసంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్, నగర ప్రధాన కార్యదర్శి పవన్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నిజామాబాద్ జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో డిస్టిక్ ట్రాన్స్ పోర్ట్ కమిషనర్(డిటిఓ) కె.వెంకట రమణకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నిజామాబాద్ జిల్లాలో ప్రైవేట్ విద్యాసంస్థల బస్‌లు 900 పైగా నడుస్తున్నాయని, విద్యాసంవత్సరం ప్రారంభమైనా పిట్ నెస్ చేయించుకోకుండా పరిమితికి మించి విద్యార్థులను కూర్చోబెట్టి బస్‌లను నడుపుతూ విద్యార్థుల జీవితాలతో ప్రైవేట్ యాజ మాన్యాలు చెలగాటం అడుతున్నారని అన్నారు. జీఓ నెం 35 ను పాటించటం లేదని, కొన్ని విద్యాసంస్థలు కాలం చెల్లిన బస్సులను ఇంకా నడుపుతు న్నారని, గతంలోనే అనేక ప్రమాదాలు జరిగిన సందర్భాలు అనేకం ఉన్నాయని గుర్తుచేశారు. రవాణా శాఖ అధికారులు జిల్లా వ్యాప్తంగా తనిఖీలు నిర్వహించి బస్ లను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పి.డి.ఎస్.యూ నాయకులు నిజామాబాద్ నగర ప్రధాన కార్యదర్శి పవన్ , నాయకులు మనోజ్ ,గంగాధర్ ,అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మ ఆలయం అభివృద్ధి కోసం కృషి చేస్తా


పనులు ప్రారంభిస్తున్న నాయకులు

నవతెలంగాణ-దోమకొండ

దోమకొండ మండల కేంద్రంలోని పెద్దమ్మతల్లి ఆలయ అభివృద్ధిలో భాగంగా బీజేపీ నాయకులు కాటిపల్లి వెంకటరమణారెడ్డి తన వంతు సాయంగా 20 లక్షల అందజేసినట్టు ముదిరాజ్ కులస్తులు తెలిపారు. మంగళవారం భూమిపూజ చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షులు పున్న లక్ష్మణ్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమం లో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి బోయిని సత్యం, కోశాధికారి నర్సింలు, డైరెక్టర్‌లు పున్న రాములు, మాజీ అధ్యక్షులు గాండ్ల రాములు, రమేష్, రాములు, ముదిరాజ్ సంఘము సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.

సజ్జనపల్లిలో బోనాలు, కుస్తీ పోటీలు

నవతెలంగాణ-లింగంపేట్

లిగంపేట్ మండలంలోని సజ్జన్‌పల్లి గ్రామంలో మంగళవారం పద్దమ్మ బోనాల పండుగ నిర్వహించారు. ముదిరాజ్ కులస్తులు ఇంటింటా బోనాలు అలంకరించి మంగళవారం గ్రామంలోని ప్రధాన వీధుల గుండా డప్పు సప్పుడుతో ఊరేగింపు చేపట్టి ఆలయం వద్ద బోనాలు పెట్టి ఒడిబియ్యం పోశారు. అనంతరం సాయంత్రం కుస్తీ పోటీలు నిర్వహించి విజేతలకు వెండి కడియాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి నిర్విరామ కృషి

- నమస్తే నవనాతపురంలో ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఆర్మూర్

నియోజక వర్గం అభివృద్ధిలో బెస్ట్, సంక్షేమంలో ఫస్ట్ అని పీయూసీ ఛైర్మన్, ఎమ్మెల్యే, జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్ రెడ్డి అన్నారు. "నమస్తే నవనాథపురం" కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆలూరు మండలంలోని దేగాం గ్రామంలో నిర్వహించిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలలో ఆయన పాల్గొన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి గ్రామంలో పర్యటించిన జీవన్ రెడ్డికి ప్రజలు ఘన స్వాగతం పలికారు. పూలమాలలు, శాలువాలతో గ్రామస్తులు, పలు కుల, ప్రజా సంఘాల పెద్దలు జీవన్ రెడ్డిని సత్కరించారు. ప్రతీ ఒక్కరినీ పేరుపేరునా పలకరిస్తూ ప్రజల యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. 'అమ్మా బాగున్నారా అంటూ మహిళలను పలకరించారు. మీకు మిషన్ భగీరథ మంచినీళ్ల వస్తున్నాయా.. నీళ్ల ట్యాంకులను శుభ్రం చేస్తున్నారా, పెన్షన్లు అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. దారి పొడవునా ఎదురైన మహిళలతో మాట్లాడి పెన్షన్లు వస్తున్నాయా..కళ్యాణ లక్ష్మీ పథకం డబ్బులొస్తున్నాయా? అని అడిగారు. ఇండ్లపై నుంచి విద్యుత్ తీగలు పోకుండా విద్యుత్ లైన్లు సురక్షిత ప్రాంతాలకు మార్చడానికి ఎన్ని స్తంభాలు కొత్తగా కావాలో అన్ని సమకూరుస్తామన్నారు. గ్రామ ప్రగతి పై అధికారులతో సమీక్ష నిర్వహించిన జీవన్ రెడ్డి దేగాం గ్రామంలో ఇప్పటికే చేపట్టిన అన్ని పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఆర్మూర్ నియోజకవర్గాన్ని రూ.3వేల కోట్లతో అభివృద్ధి చేశానన్నారు. కాంగ్రెస్, బీజేపీలు అభివృద్ధి నిరోధక, ప్రజా వ్యతిరేక పార్టీలని ఆయన మండిపడ్డారు. అభివృద్ధి, సంక్షేమం చర్చకు సిద్ధమా? అని జీవన్ రెడ్డి బహిరంగ సవాల్ విసిరారు.తాను చెప్పేవి అవాస్తవాలని నిరూపిస్తే ముక్కు నేలకు రాస్తానని స్పష్టం చేశారు. ఎంపీ అరవింద్ వంటి మోసగాళ్లకు ప్రజలను ఓట్లు అడిగే హక్కు లేదన్నారు. కాంగ్రెస్, బీజేపీ నేతలు గ్రామాలకొస్తే ప్రజలు చీపుర్లతో కొట్టాలన్నారు. ప్రజల మద్దతు తనకే ఉందని, తాను మళ్ళీ గెలిచి హ్యాట్రిక్ సాధిస్తా అని జీవన్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు సర్పంచ్ గడ్డం సరోజ గంగారెడ్డి ,ప్రజా ప్రతినిధులు, పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు హెచ్ఎంకు ప్రశంసాపత్రం అందజేత

నవతెలంగాణ-ఆర్మూర్

తెలంగాణ రాష్ట్ర అవతరణ సందర్భంగా దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని మంగళవారం ప్రాథమిక పాఠశాల గోవిందపేట్ ప్రధానోపాధ్యాయురాలు మాడ వేడి పద్మావతిని ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డి ఆలూర్ మండల కేంద్రంలో మంగళవారం ప్రశంస పత్రం అందజేశారు. మహిళా సంక్షేమ దినోత్సవం -మహిళా ఉద్యోగులకు సన్మానం కార్యక్రమం సందర్భంగా మండల ఉత్తమ మహిళా ఉపాధ్యాయురాలిగా ప్రశంసపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పి చైర్మన్ విఠల్ రావు, ఎమ్మెల్యే సతీమణి రజిత రెడ్డి,ఎంపీపీ పస్క నర్సయ్య, మున్సిపల్ చైర్మన్ పండిట్ వినీత, మండల విద్యాధికారి రాజా గంగారం, టీఎన్జీవో నాయకురాలు తార తదితరులు ఉన్నారు.

గురుకులంలో ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-ఎడపల్లి

ఎడపల్లి మండల పరిధిలో గల తెలంగాణ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభమైనట్లు పాఠశాల ప్రిన్సిపల్ సుహాసిని రెడ్డి తెలిపారు. ఐదవ తరగతిలో 80 సీట్లకు, ఇంటర్ మొదటి సంవత్సరం బైపిసీ, ఎంపీసీ కలిపి 80 సీట్లకు భర్తీ చేయనున్నట్టు పేర్కొన్నారు. పాఠశాల, కళాశాలలో చదివిన బాలికలు తొందరగా జాయినింగ్ రిపోర్ట్ ఇవ్వాలని ఆమె కోరారు. పుస్తకాలు, యూనిఫామ్ ఇతరత్రా వస్తువులు ముందుగా చేరుకున్న బాలికలకు అందజేస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు మాధురి దేవిని బాలికలు సంప్రదించాలని ప్రిన్సిపల్ సువాసినీ రెడ్డి తెలిపారు.

మహిళ సాధికారతతోనే సమాజాభివృద్ధి

- **స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి**

నవతెలంగాణ-వర్ని

తెలంగాణ రాష్ట్రం వచ్చిన తరువాత మహిళాల అభ్యున్నతికీ ప్రభుత్వం పెద్ద పీట్టం వేసిందని, మహిళ సాధికారతతోనే సమాజాభివృద్ధి జరుగుతుందని తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం వర్ని మండలకేంద్రంలో సిసిడి ఫంక్షన్‌హాల్లో మహిళ దినోత్సవం వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి హాజరై మాట్లాడారు. దేశంలో సగభాగం మహిళలే అని, మహిళలు అన్ని రంగాల్లో ముందు ఉంటున్నారని తెలిపారు. మహిళలు అభివృద్ధి చెందితే ప్రపంచం బాగుంటుందన్నారు. దేశంలో, రాష్ట్రంలో 80శాతం మంది మహిళలు పేదవాడు మధ్య తరగతి వారే ఉన్నారని, వారికి మాత్రమే ప్రభుత్వ సంక్షేమ పథకాలు కావాల్సి ఉంటుందని తెలిపారు. ముఖ్యమంత్రి కెసిఆర్‌కు మహిళల కష్టాలు ఎదురైన సంఘటనలే కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకాల ఏర్పాటుకు దారి తీసిందన్నారు. దేశంలో ఏ రాష్ట్ర ముఖ్యమంత్రులు చేపట్టని కళ్యాణ్ లక్ష్మి షాదీ ముబారక్



మాట్లాడుతున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

కెసిఆర్ కిట్టు అమృత లక్ష్మి ప్రవేశపెట్టిన ఏకైక ముఖ్యమంత్రి మన కెసిఆర్ అని అన్నారు. తన 47 సంవత్సరాల రాజకీయ చరిత్రలో కేసీ లాంటి ధైర్యవంతుడైన సీఎంను చూడలేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 13 లక్షల 16 వేయిల మందికి కళ్యాణ్ లక్ష్మి షాదీ ముబారక్ 11 వేల కోట్ల రూపాయలు అందించడం జరిగిందన్నారు. నియోజకవర్గంలో 13 వేల మందికి 123 కోట్లు ఇప్పటివరకు ఇచ్చామన్నారు. 4 కోట్ల 70 వేల మంది బీడీ కార్మికులకు, లక్ష 79వేయిల ఒంటరి మహిళలకు గత ప్రభుత్వాలు 200 రూపాయలు పెన్షన్ ఇస్తే కేసీఆర్ 2వేలు ఇవ్వటం జరుగుతుందన్నారు. గొప్పలు చెప్పే ప్రధాన మంత్రి సొంత రాష్ట్రంలో ప్రక్క రాష్ట్రాల్లో 600 నుంచి 1000 రూపాయల వరకే పెన్షన్ ఇస్తున్నారని, వారికి సాధ్యం కానిది కేసీఆర్‌కు సాధ్యం అయిందన్నారు. అంగన్వాడి సెంటర్లలో బాలింతలకు, గర్భిణి స్త్రీలకు, పుట్టబోయే బిడ్డలకు, సెంటర్లలో చదువుకుంటున్న పిల్లలకు పౌష్టికమైన ఆహారాన్ని అందిస్తున్నారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడి కేంద్రాలు 36 వేయిల సెంటర్లు ఉన్నాయన్నారు. నియోజకవర్గం లో 230 కొత్త అంగన్వాడి సెంటర్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పుట్టిన బిడ్డ నుంచి ఆరు మాసాల వరకు పెరిగే వరకు ప్రభుత్వం వారికి న్యూట్రిషన్ కిట్టు, కేసీఆర్ కిట్లు, ఇంటికి వెళ్ళిన తర్వాత తల్లికి మంచి పౌష్టిక ఆహారం అందించడానికి 3 వేయిల రూపాయలు ఖాతాలో జమ చేస్తుందన్నారు. అమ్మ ఒడి ద్వారా ప్రభుత్వ ఆసుపత్రిలో సుఖవంతమైన డెలివరీ చేయించి ఇంటికి చేరేలా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. రాష్ట్రంలో అధిక శాతం బాలికల ప్రభుత్వ పాఠశాలలో ఎక్కువగా ఉన్నాయన్నారు. నియోజకవర్గంలో ఇప్పటివరకు నిరుపేద కుటుంబాలకు 11వేల డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను మంజూరు చేసి గృహప్రవేశాలు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ చిత్ర మిశ్రా, డిపిఓ జయసుధ, ఆర్ డి ఓ లు రాజగౌడ్, రాజేశ్వర్, డిసిసిబి చైర్మన్ భాస్కర్ రెడ్డి, పోచారం సురేందర్ రెడ్డి, ఎంపీపీ మేక శ్రీలక్ష్మి, పిట్ల ఉమ, సుజాత, ఎంపీడీఓ భారతి, నీలవతి, సర్పంచ్‌లు నెమని నాగమణి, భాగ్య, గంగామణి, పద్మ, ఎంపీటీసీ గంగామణి, తహసీల్దార్ విఠల్, ఎంపీడీఓ బశిరోద్దీన్, ఏపీఓ చందర్, తారాచందు, ఎంపీవో మంజుల, ఏఎంసి వైస్ చైర్మన్ గోపాల్, మండల అధ్యక్షులు గిరి, కర్లం సాయరెడ్డి, దాసరి గంగారాం,ఖాదర్, కో ఆప్షన్ మెంబర్ కరీం, మస్తాన్, మహిళలు పాల్గొన్నారు.

మల్లాపూర్‌లో ఐమాక్స్ లైటింగ్ బిగింపు


బిగించిన లైట్లు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్‌వాయి మండలంలోని మల్లాపూర్ గ్రామంలో ఐమాక్స్ లైటింగ్‌ను మంగళవారం బిగించినట్లు సర్పంచ్ లోలం సత్యనారాయణ, ఉప సర్పంచ్ రఘునథన్ రాము తెలిపారు. ఐమాక్స్ లైటింగ్ బిగించడానికి ఇందల్ వాయి జడ్పీటిసి సభ్యురాలు గడ్డం సుమన రవి రెడ్డి జడ్పీ నిధులు లక్షా 50 వేల రూపాయలు మంజూరు చేసినట్లు సర్పంచ్ లోలం సత్యనారాయణ ఉప సర్పంచ్ రఘునథన్ రాము తెలిపారు. అడిగిన వెంటనే నిధులను మంజూరు చేసినందుకు గ్రామం తరపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. మల్లాపూర్ గ్రామ అభివృద్ధికి ముందుకొచ్చి గ్రామాన్ని అన్ని విధాలా సహాయ సహకారం చేస్తున్న ఆర్టీసీ చైర్మన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, యువనాయకులు బాజిరెడ్డి జగన్ మోహన్ కు హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు.

లబ్ధిదారులకు ఆర్థిక సాయం చెక్కుల పంపిణీ


చెక్కులు అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని చౌట్‌పల్లి గ్రామానికి చెందిన ఇద్దరు లబ్ధిదారులకు ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరు చేసిన ఆర్థిక సహాయం చెక్కులను మంగళవారం అందజేశారు. ఏలేటి రాజేందర్‌కు రూ.30వేలు, గడ్డం ధర్మేందర్‌కు రూ. 75వేల ఆర్థిక సహాయం చెక్కులను వారి ఇంటి వద్దకు వెళ్లి బీఆర్ఎస్ నాయకులు అందజేశారు. ఆర్థిక కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు అరెల్లి నవీన్ గౌడ్, రైతు బంధు సమితి గ్రామ కోఆర్డినేటర్ కొమ్ముల రాజేందర్ రెడ్డి, నాయకులు కుమ్మరి రాజేశ్వర్, గడ్డం రాజేశ్వర్, సందీప్, మురళి, నాగార్జున, బద్దం రాజేశ్వర్, కపింద్ర, సాదుల్లా, బ్రహ్మ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

- **సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా**

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాలని, సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 12న "తెలంగాణ దీక్షా దివస్" పేరుతో ధర్నా నిర్వహించాలన్న సిపిఐ(ఎంఎల్) ప్రజాపంథా పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా డిచ్ పల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో తాహసిల్దార్ కార్యాలయం ముందు మంగళవారం ధర్నా నిర్వహించి తహసిల్దార్ శ్రీనివాస్ రావుకు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ(ఎంఎల్) ప్రజాపంథా రూరల్ సబ్ డివిజన్ కార్యదర్శి సాయగౌడ్ మాట్లాడుతూ .. ఘన్పూర్ శివారులోగల 349 సర్వే నెంబర్‌లో సుమారు 8 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నదని, ఆ భూమిని ప్రభుత్వం సర్వే జరిపి పేద ప్రజలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇంటి నిర్మాణానికి పది లక్షల రూపాయలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇవ్వాలని అన్నారు. అలాగే నూతన రేషన్ కార్డులు ఇవ్వాలని, నిరుద్యోగులకు జీవన భృతి ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కిషన్, మోహన్, అనురాధ, ఆమని, గౌసియ, ముంతాజ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో గేదె మృత్యువాత

నవతెలంగాణ-ఆర్మూర్


మృతిచెందిన గేదె

పట్టణంలోని మామిడిపల్లి పెద్దమ్మ గుడి రైల్వే ట్రాక్ దగ్గర కొండూరు గొల్ల దేవన్నకు చెందిన గేదెకు ఎల్‌టి లైను విద్యుత్ షాక్ తగిలి మృతి చెందినట్టు గ్రామస్తులు మంగళవారం తెలిపారు. దీంతో విద్యుత్ అధికారులు సైతం పరిశీలించినట్టు దేవన్న తెలిపాడు.

ఎవరి ప్రయోజనాలకోసం ఈ దశబ్ది ఉత్సవాలు

- **ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు వేల్పూర్ భూమయ్య**

నవతెలంగాణ-డిచ్‌పల్లి

బీఆర్ఎస్ 9 ఏండ్ల పరిపాలనలో ఎవరి ప్రయోజనం నెరవేర్చిందని ఈ దశబ్ది ఉత్సవాలు జరుపుకుంటున్నారని ఏఐకెఎంఎస్ జిల్లా అధ్యక్షులు వేల్పూర్ భూమయ్య ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మంగళవారం డిచ్‌పల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తే దళితున్ని ముఖ్యమంత్రి చేస్తానని చెప్పిన కేసీఆర్ ఆయన్నే ముఖ్యమంత్రి అయ్యారని, దళితులకు 3 ఎకరాల భూమి పంపిణి చేస్తానని చెప్పి దళిత సమాజన్ని మోసం చేశారని, రైతులకు లక్ష లోపు రుణమాఫీ హామీ మరిచి రైతులను మోసం చేశారని, ఇంటికో ఉద్యోగం, ఉపాధి అవకాశాలు, నిరుద్యోగ భృతి హామీ గాలికొదిలారని అయన దుయ్యబట్టారు. పేదవారి సొంత ఇంటి కల నెరవేర్చడానికి డబుల్ బెడురూమ్ ఇండ్లను నిర్మించి ఇస్తామని చెప్పిన మాట ఏమైందని అన్నారు. అధికారంలోకి రాగానే వంద రోజుల్లోనే మూతపడిన చక్కెర ఫ్యాక్టరీలు తెరిపించి నడిపిస్తానని చెప్పి 9 ఏండ్లు పూర్తి అయినా ఆ హామీ నెరవేరలేదని, పైగా చెరుకు రైతు బతుకులో చేదును మిగిల్చి, కార్మికులను రోడ్డున పడేసిన చరిత్ర కేసీఆర్‌కే దక్కిందన్నారు. తెలంగాణలోనే సహకార రంగంలో కొనసాగిన ఏకైక చక్కెర ఫ్యాక్టరీ సారంగాపూర్‌ను ఎన్‌సిఎస్‌ఎఫ్‌ను తెరిపించి నడిపించాలని లేదా 95 యాక్టులో రైతులకే అప్పజెప్పాలని అయన డిమాండ్ చేశారు. మిగులు బడ్జెట్లో ఉన్న తెలంగాణను అప్పుల తెలంగాణగా మర్చి బంగారు తెలంగాణగా అంటూ కేసీఆర్ కల్లబొల్లి మాటలతో కాలం గడుపుతున్నాడని పేర్కొన్నారు. ప్రజాధనాన్ని దశబ్ది ఉత్సవాల పేరిట విచ్చలవిడిగా ఖర్చు చేస్తూ ప్రజలను అయోమయనికి గురి చేస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా బీఆర్ఎస్ ప్రభుత్వ చర్యలను ఎండగట్టాలని ప్రజలను అయన కోరారు. సమావేశంలో జిల్లా ఎఐకెఎంఎస్ ప్రధాన కార్యదర్శి దేశెట్టి సాయరెడ్డి, సహాయ కార్యదర్శి దేవస్వామి, సాయిలు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వేల్పూర్ భూమయ్య

సబ్బండ వర్గాల సంక్షేమమే కేసీఆర్ ధ్యేయం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

సబ్బండ వర్గాల సంక్షేమమే ముఖ్యమంత్రి కేసీఆర్ ధ్యేయమని, రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకుంటున్న విప్లవాత్మక నిర్ణయాలపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయని ఆర్టీసీ చైర్మన్ నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంజూరైన ప్రొసీడింగ్ పాత్రలను అందజేశారు. డిచ్‌పల్లి మండలంలోని సాంపల్లి గ్రామానికి సంబంధించిన అంగన్వాడి భవనానికి రూ.5 లక్షలు, మహిళా భవనానికి రూ.10 లక్షల రూపాయల పత్రాలను మహిళా సంఘ సభ్యులకు, ప్రజాప్రతినిధులకు పంపిణీ చేశారు. రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేయడం జరుగుతుందని, సంక్షేమమే కాకుండా అభివృద్ధికి వందల కోట్ల రూపాయలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జడ్పిటిసి దాసరి ఇందిరా లక్ష్మీ నర్సయ్య, మండల అధ్యక్షులు చింత శ్రీనివాస్ రెడ్డి, సర్పంచుల పోరం అధ్యక్షులు మోహన్ రెడ్డి, సీనియర్ నాయకులు శక్కరి కొండ కృష్ణ, ఉప సర్పంచ్ చిక్కెల మోహన్, మహిళా సంఘం నాయకురాలు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు, ఆయాలకు చీరలు అందజేత

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలంలోని హసాకొత్తూర్, బషీరాబాద్, చౌట్ పల్లి గ్రామాల్లో మంగళవారం తెలంగాణ మహిళ సంక్షేమ దినోత్సవం సందర్భంగా గ్రామపంచాయతీ సపాయి సిబ్బందికి, అంగన్వాడీ ఆయాలకు చీరలను పంపిణీ చేశారు.మహిళా ఉద్యోగులకు సన్మాన కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి తన సొంత ఖర్చుతో చీరలను అందజేశారు. ఆ చీరలను ఆయా గ్రామా పంచాయతీ కార్యాలయాల వద్ద సర్పంచుల చేతుల మీదుగా సపాయి సిబ్బందికి, అంగన్వాడీ ఆయాలకు పంపిణీ చేశారు. తమ సేవలను గుర్తించి చీరలు పంపించిన మంత్రి ప్రశాంత్ రెడ్డికి సఫాయి సిబ్బంది, అంగన్వాడీ ఆయాలు ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు ఏనుగు పద్మ రాజేశ్వర్, సక్కారం అశోక్, మారు శంకర్, పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాస్, గంగ జమున, ఉపసర్పంచ్ కస్తూరి విక్రమ్, వార్డు సభ్యులు గణేష్, శ్రీధర్, సాగర్, బిఆర్ఎస్ నాయకులు బి.మహేష్, బి.యన్. మోహన్, రమేష్, ప్రశాంత్, మురళి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


చీరలు అందజేస్తున్న సర్పంచ్

సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అభివృద్ధి పనులు : మేయర్

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగరంలోని 16వ డివిజన్ దుబ్బ ప్రాంతంలోని రామ్ గోపాల్ వీధిలో 13లక్షల నిధులతో చేపట్టే స్ట్రాం వాటర్ డ్రైనేజీ నిర్మాణ పనులకు 35, 36, 43డివిజన్ల పరిధిలో 10లక్షల నిధులతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించినట్లు నిజామాబాద్ నగర మేయర్ దండు నీతూ కిరణ్ శేఖర్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా నిజామాబాద్ నగర మేయర్ దండు నీతూ కిరణ్ శేఖర్ మాట్లాడుతూ.. నగర ప్రజలకు అన్ని రకాల మౌలిక సదుపాయల కల్పనే లక్ష్యంగా పార్టీలకు అతీతంగా అన్ని డివిజన్ల అభివృద్ధికి నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే గణేష్ గుప్త నిధులు కేటాయిస్తున్నారని ఎమ్మెల్యేకి కార్పొరేటర్ల తరుపున ధన్యవాదాలు తెలిపారు. ఈ నాలా ద్వారా వర్షపు నీరు లోతట్టు ప్రాంతాలలో చేరకుండా మళ్లింపు చేస్తామని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పంచరెడ్డి ప్రవళిక, సుధీర్, మాస్టర్ శంకర్, మున్సిపల్ ఇంజనీర్ సుభాష్, నాయకులు మదని శ్రీధర్ వినోద్, పంచరెడ్డి అనిత, మధుకర్ రెడ్డి కాలనీ ప్రజలు పాల్గొన్నారు.


పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్

అంబేద్కర్ చిత్రపటానికి వినతి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ రాష్ట్రం లోని 12 యూనివర్సిటీ కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి మంగళవారం తెలంగాణ యూనివర్సిటీ కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల సంఘం అధ్యక్షులు డాక్టర్ వి దత్తాహరి అధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అంబేద్కర్ ఆలోచన విధానాన్ని, విద్యా విధానంలో మార్పు, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆరోజు రాజ్యాంగంలో రాసిన అంశాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ ఏకీభవిస్తూ కాంట్రాక్టు ఉపాధ్యాయులందరినీ రెగ్యులరైజ్ చేస్తామని చెప్పడం జరిగిందన్నారు. కానీ కొన్ని అనివార్య కారణాల వల్ల అధికారులు కాంట్రాక్ట్ అధ్యాపకుల ఫైల్‌ను పక్కన పెట్టించడం జరిగిందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోనూ 12 యూనివర్సిటీల్లో పనిచేస్తున్న 1335 మంది కాంటాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెర్లను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని సంఘం అధ్యక్షులు డాక్టర్ వి దత్తాహరి తెలిపారు. యూనివర్సిటీ లో పనిచేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్లను త్రీ మెన్ కమిటీ ద్వారా నియమించారని 15 నుండి 20 ఏళ్ళ నుండి అన్ని అర్హతలు ఉండి చాలీచాలని వేతానాలు పొందుతూ కుటుంబాలను పోషించుకుంటున్నామని వివరించారు. అటెండర్ నుండి డిగ్రీ కళాశాల అధ్యాపకులను రెగ్యులరైజ్ చేసి ప్రభుత్వ యూనివర్సిటీల కాంటాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లపై సవితి తల్లి ప్రేమ కనబరుస్తూ నిర్లక్ష్యం చేస్తున్నారని అయన ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ జోష్న ,డాక్టర్ అపర్ణ ,డాక్టర్ రమ్య, డాక్టర్ గోపి రాజ్, డాక్టర్ జలంధర్, డాక్టర్ దేవరాజ్ శ్రీనివాస్, డాక్టర్ సిహెచ్ శ్రీనివాస్, డాక్టర్ సురేష్, డాక్టర్ శరత్, డాక్టర్ పురుషోత్తం, డాక్టర్ రామలింగం, డాక్టర్ జి శ్రీనివాస్, డాక్టర్ గంగ కిషన్, డాక్టర్ నాగేంద్రబాబు, డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ మోహన్, డాక్టర్ నర్సయ్య, డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ డానియల్, డాక్టర్ స్వామి, ఈ గంగా కిషన్ పాల్గొన్నారు.

లక్ష్యం మేరకు పంట రుణాలను మంజూరు చేయాలి

అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

లక్ష్యం మేరకు పంట రుణాలను మంజూరు చేసి రైతుల ఆర్థికాభ్యున్నతికి సహకరించాలని జిల్లా అదనపు కలెకర్ చిత్రా మిశ్రా బ్యాంకు అధికారులకు సూచించారు. రుణాల మంజూరుపై బ్యాంకు మేనేజర్లు, సంబంధిత శాఖల అధికారులతో మంగళవారం కలెక్టర్ మీటింగ్ హాల్లో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో బ్యాంకుల లక్ష్యం మేరకు పంట రుణాలు, గవర్నమెంట్ స్కీమ్‌లోన్లు సకాలంలో మంజూరు చేయాలని అన్నారు. వీధి రుణాలు అర్హులందరికీ మంజూరు చేయాలని సూచించారు. 2023-24 సంవత్సరానికి సంబంధించిన జిల్లా రుణా ప్రణాళికను విడుదల చేశారు. సమావేశంలో డిఆర్డిఏ పిడి చందర్ నాయక్, లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసరావు, మెప్మా పిడి రాములు, రిజర్వ్ బ్యాంక్ అధికారి కె.అనిల్ కుమార్, నాబార్డ్ డిడి ప్రవీణ్ కుమార్, అన్ని బ్యాంకుల అధికారులు గ్రామాభివృద్ధి శాఖాధికారులు పాల్గొన్నారు.

కుల సర్టిఫికెట్ తీసుకొని మాపై దాడులు చేస్తే సహించం

నవతెలంగాణ-కంఠేశ్వర్

కుల సర్టిఫికెట్ తీసుకొని, మాపై దాడులు చేస్తే సహించేది లేదని గోసంగి సంఘం జిల్లా అధ్యక్షులు మల్లెల సాయి చరణ్ అన్నారు. మంగళవారం ప్రెస్ క్లబ్ లో మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. బోధన్, ఆర్మూర్, భీంగల్‌లలో బుడగ జంగాలు మా (గోసంగి) కుల సర్టిఫికెట్ తీసుకొని ఉద్యోగాలు, కులసంఘ భవనాలతో పాటు అన్ని ప్రభుత్వ పథకాలలో లబ్ధి పొందుతూ నిజమైన గోసంగి కులస్తులకు తీరని అన్యాయం చేస్తున్నారని అన్నారు. బోధన్ కు చెందిన గంధం రాజేష్ అనే బుడగ జంగాల కులానికి చెందిన వ్యక్తి తాను గోసంగి సంఘానికి సంబంధించిన కుల ధ్రువీకరణ పత్రాలు సంపాదించుకొని మాపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర కన్వీనర్ జెన్నారపు రాజేష్, రాష్ట్ర అధ్యక్షులు సర్దని గంగా నర్సయ్య మాట్లాడుతూ.. గోసంగి కులానికి సంబంధించిన అన్ని ఆధారాలు, జీఓ కాపీలు తమ వద్ద ఉన్నాయని, తమ ఉనికి అస్తిత్వానికి సంబంధించి అన్ని ఆధారాలు ఉన్నాయని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సుక్క భాస్కర్ కోశాధికారి ధర్మపురి, వర్కింగ్ ప్రెసిడెంట్ సాయన్న, సలహాదారులు శంకర్, ప్రవీణ్, కిష్టయ్య, శ్రావణ్, నడిపి నర్సయ్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మహిళల సంక్షేమం కోసం కృషి చేస్తున్నది తెలంగాణ ప్రభుత్వమే

- **మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మెన్ పద్మావతి**



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పద్మావతి

నవతెలంగాణ-బోధన్

తెలంగాణ ప్రభుత్వం మహిళల సంక్షేమం కోసం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తూ వారి అభివృద్ధికి కృషి చేస్తుందని బోధన్ మున్సిపల్ చైర్ పర్సన్ తూము పద్మావతి అన్నారు. మంగళవారం బోధన్ పట్టణంలోని అప్నా ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఆమె పాల్గొని మాట్లాడారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని సంక్షేమ కార్యక్రమాలను తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్నదని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే సతీమణి ఆయేషా ఫాతిమా మాట్లాడుతూ సమాజంలో గతంలో ఆడపిల్లలపై వివక్ష కొనసాగేదని కానీ తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ వివక్ష తొలగిపోయిందన్నారు. ఆడపిల్ల జన్మించిన నుంచి వివాహం అయ్యే వరకు ప్రభుత్వం వారికి అండగా నిలుస్తుందని అన్నారు. కార్యక్రమంలో చిన్నారులు చేసిన నృత్యాలు అలరించాయి. మహిళా సంక్షేమ దినోత్సవం కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ రజిత యాదవ్, ఎంపీపీ బుద్దె సావిత్రి, ఆర్డిఓ రాజేశ్వర్, ఏఎంసీ చైర్మన్ పి.ఆర్ దేశాయ్, సీడీపీఓ జానకి, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు గోపిలక్ష్మీ, గంగావేణి, సౌజన్య రాధిక,ఆసియా, ఆశ వర్కర్లు, మహిళలు పాల్గొన్నారు.

రైతాంగ సమస్యలు పరిష్కరించాలి

- **అఖిలభారత రైతు కూలీ సంఘం**

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రైతాంగ సమస్యలు పరిష్కరించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.భాస్కర్ అన్నారు. అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో ఏవో ప్రశాంత్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం బి.భాస్కర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో విచ్చలవిడిగా కల్తీ విత్తనాలు, ఎరువుల అమ్మకాలు జరుగుతున్న వాటిని అరికట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సబ్సిడీతో ఎరువులు విత్తనాలు అందజేయాలని డిమాండ్ చేశారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన రైతు రుణమాఫీ తక్షణం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అకాల వర్షాలకు, వడగళ్ల వానకు దెబ్బతిన్న పంటలకు తక్షణం నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. నెలరోజులైనా రైతుల ఖాతాలో ధాన్యం డబ్బులు ప్రభుత్వం జమ చేయకపోవడం సిగ్గుచేటన్నారు. రైతులకు 75 శాతం సబ్సిడీతో వ్యవసాయ పరికరాలు అందజేయాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్లో కనీస మద్దతు ధరల చట్టాన్ని తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమస్యలు పరిష్కరించని ఎడల పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గంగారెడ్డి, దుడ్డు గంగాధర్, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు వరదయ్య, పివైఎల్ జిల్లా అధ్యక్షుడు శ్రావణ్ కుమార్ రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు కే.రాజేశ్వర్, పోతన్న, ఉషన్న, దేవదాస్, షేక్ నజీర్, అజయ్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పెన్షన్ అదాలత్

నవతెలంగాణ-కంఠేశ్వర్

పెన్షనర్లు సమస్యలకు సంబంధించిన పెన్షన్ అధాలత్ ఈనెల 14న ఉదయం 11.00 నుండి 11.40 వరకు ఫిర్యాదులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నట్లు బి. మధుసూధనా చారి, సహాయక పి.ఎఫ్ కమీషనర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పిర్యదుదారులు విబేక్స్ వెబ్‌సైట్‌లో మీటింగు నెంబర్ 26425963152 పాస్వర్డ్, ఈఎస్ఎఫ్ 234 ఎంటర్ చేసి పాల్గొనాలని సూచించారు.